అభినవసరస్వతి

సంపుటము ౨౮ | ధాతృనామ సంవత్సరము కార్తికమాసము | సంచిక ౮

జీవన్ముక్తి ప్రకాశిక

ఇది విద్యారణ్యవిరచితమైన యొక వేదాంతగ్రంథము. చెన్నపురిలో వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారు 10 సం॥ లనాఁడు ప్రకటించిరి. వీరిట్టి వేదవేదాంతస్మృతీతిహాసపురాణాది గ్రంథములఁ జక్కఁగా ముద్రింపించి ప్రచురించుచు లోకమున కెంతయు నుపకరించుచున్న ధన్యతములు. ఇట్టి లోకోపకారుల సన్మానించుటకు లోకులొనర్చిన ప్రయత్నము ప్రశంసాపాత్రము. ఎంతసన్మానమొనరించినను వీరి విషయమున నింకను దక్కువయనిపింపకుండదని మాయభిప్రాయము. ఏతద్గ్రంథకర్తలగు విద్యారణ్యులవారు విరచించిన గ్రంథములు వేలుకాని వందలు కావు. విద్వద్వరులకే వేద్యముకాని వేదమున కంతటికి భాష్యమును వ్రాసిన భగవదవతారుల ప్రస్తుతికి మేరయెక్కడిది ? బుక్కరాయలు భూపాలుఁడైనను మంత్రియై మహీమండలము తామే యేలుచు మాధవాచార్యనామముతో మనినకాలమునఁ బరాశరమాధవీయాది ధర్మశాస్త్రగ్రంథములును జ్యోతిర్వైద్యవ్యాకరణ మీమాంసాదిగ్రంథములునే కాక ముముక్షువులు ముక్తులగుటకు ముఖ్యముగాఁ బఠింపఁదగిన వివరణోపన్యాస చిత్రదీప తృప్తిదీపాది గ్రంథముల రచించి యాగ్రంథములలోని సారమంతయుం దీసి వీరీజీవన్ముక్తిప్రకాశికను విరచించిరి. మోక్షసౌధ మెక్కుట కియ్యది ముఖ్యనిశ్రేణిక. వాసిష్ఠరామయణ భగవద్గీతా భాగవతాదులనుండి యిందు వలసినన్ని ప్రమాణములు గైకొనఁబడినవి. శాస్త్రజ్ఞులకే యీగ్రంథమందలి సకలార్థము గ్రహింప శక్యమగునుగాని సామాన్యసాహిత్యవంతులకు సంశయగ్రస్తమే. కనుకఁ గరుణాళువులగు వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రిగారు యావజ్జనులకును నతిసులభముగా బోధకాఁదగునాంధ్ర తాత్పర్యముతో నచ్చుగూర్పించి యత్యంతోపకార మాచరించిరి. ఆయాంధ్రతాత్పర్య మగ్గింపఁదగినదే యున్నది కాని సర్వసులభమగుటకుఁ గాఁబోలు సంధులు విడఁదీసియు సర్వత్ర యాదేశముల నగుపఱుపకయు నతి వ్రాసినవారు వ్యాకరణము నాశ్రయించినవారు కారు. ములకుఁ బూర్వముమాత్ర మర్ధానుస్వారములు వేయఁబడినవికాని యంతట నయ్యవియు నగుపడవు. తీసుకొని మొదలగు నపప్రయోగములును నచ్చటచ్చట నగపడియెడు. జీవన్ముక్తికి సాధనము విద్వత్సన్యాసము. దానికి ముఖ్యకారణము వైరాగ్యము. దారపుత్రాదులపైఁ దనకుఁ గల యనురాగలత త్రెంపివేసికొనుటయే వైరాగ్యము.

పునరావృత్తిగల బ్రహ్మలోకాది పుణ్యలోకములతోఁగూడ నాకుఁ బ్రయోజనము లేదను స్థిరబుద్ధి తీవ్రవైరాగ్యము. అట్టివైరాగ్యముగలవారే విద్వత్సన్న్యాసులనియు వారిదే జీవన్ముక్తియనియు నీగ్రంథమున వివరింపఁబడినది. ముక్తికి మనఃక్షయమే ముఖ్యకారణముగాఁ బ్రతిపాదితము - క్షయమనఁ దన్నిరోధము.

శ్లో॥ అవశ్యంభావిభోగానాం ప్రతీకారో భవేద్యది
తదా దుఃఖై ర్నలిప్యేరన్ నల రామ యుధిష్ఠిరాః

అని తన్మనోనిరోధము సరిగా లేకపోవుటచేతనే నలరామయుధిష్ఠిరులు దుఃఖముల పాలగుట చూపఁబడినది. ఇంకను దెలిసికొనఁదగిన యనేకవిషయము లిట్లే యిందలరారెడిని. చూడుఁడు.

... ప్రారబ్ధకర్మయన వర్తమానదేహమును గలుగఁజేసి సుఖదుఃఖముల ననుభవింపఁజేయు కర్మ...ఈకాలమునందుండు జ్ఞానాధికారు లందఱుఁ బ్రాయశః, ఉపాసనఁ జేయనివారుగానే యున్నారు...

శ్లో॥ ఆత్మసంభావితాస్స్తబ్ధా ధనమాన మదాన్వితాః

అసురప్రకృతిగలవారలు... ద్రవ్యముచే నభిమానము గర్వము గలవారు... తనయందుఁగలిగియున్న గుణములచేతను లేనిగుణములచేతను దనను సర్వజనులకంటె హెచ్చుగాఁ దలఁచు చిత్తవృత్తి యహంకార మనఁబడును... నారదాదిమహామునుల చేతఁగూడ నాదరింపఁదగిన మహాగుణములుగల శ్రీరాములవారికిని బతివ్రతాశిరోమణియై జగన్మాతయగు సీతాదేవికిని వినుటకు శక్యముకాని లోకాపవాద ప్రాప్తించినది. ఇంక సాధారణమైన మనుష్యులే ప్రకారముగా లోకవిరోధము లేకుండ సంచరింపఁగలరు? ... దక్షిణదేశపు బ్రాహ్మణులచేత నుత్తరదేశపు బ్రాహ్మణులు వేదవేదాంగములు చదివినవారైనప్పటికి మాంసభక్షణము చేయుచున్నారని నిందింపఁబడుచున్నారు. ఉత్తరదేశబ్రాహ్మణులచేత దక్షిణదేశబ్రాహ్మణులు మేనరికము చేయుచున్నారని నిందింపఁబడుచున్నారు. ఋగ్వేదులగు బ్రాహ్మణులు శుక్లయజుర్వేదముకంటె ఋగ్వేదము హెచ్చని తలఁచెదరు. కాణ్వశాఖీయులగు బ్రాహ్మణులు ఋగ్వేదాది వేదములకంటె శుక్లయజుర్వేదము శ్రేష్ఠమని తలఁచెదరు. ఈప్రకారము తమతమ కులగోత్రబంధువర్గేష్టదేవతాదులను శ్రేష్ఠముగాఁ దలంచి స్తుతిచేయుటయు నితరుల కులగోత్రాచారాదులను దక్కువగాఁ దలఁచి నిందించుటయుఁ బండితులు మొదలు పామరులవఱకు సుప్రసిద్ధముగాఁ గనఁబడుచున్నది. ఈప్రకారము గుణదోషము లాయాపురుషుల రుచిభేదముచేత నేర్పడియున్నందున సకలజనులచే నిందింపఁబడకుండఁ బ్రవర్తించుట కెవ్వరికిని శక్యముకాదు. ఈయర్థమే

శ్లో. శుచిః పిశాచో వికలోవిచక్షణఃక్షమోస్యశక్తోబలవాంశ్చదుర్బలః
నిస్వో వ్యచోర సుభగోప్యకామీ కో లోకమారాధయితుంసమర్థః

అని పూర్వగురువులచేఁ జెప్పఁబడినది...శాస్త్రవాసనయును గర్వమునకుఁ గారణమైనందున మలినవాసనయనియే చెప్పఁబడును. శ్వేతకేతువను మునికుమారుఁడు

స్వల్పకాలములో వేదవేదాంగముల నన్నిటిని జదువుకొని మహాగర్వముకలవాఁడై తండ్రియగు నారుణి విషయమైకూడ వినయములేకయుండెనని ఛాందోగ్యము నాఱవ యధ్యాయమునందుఁ బఠింపఁబడుచున్నది...

శ్లో. గంగా గంగేతి గంగేతి యోజనానాం శతేష్వపి
స్థితై రుచ్చారితం హంతి పాపం జన్మత్రయార్జితం...

శ్లో. సాలగ్రామశిలావారి పాపహారి విశేషతః
ఆజన్మకృతపాపానాం ప్రాయశ్చిత్తం దినేదినే...

ఈలాగంటి శాస్త్రములు సచ్ఛాస్త్రశ్రవణము సత్పురుషభక్తి మొదలైన సద్గుణములు లేనివారికి గంగాస్నానాదులు పాపనివారకములు కావని చెప్పు మఱి కొన్ని శాస్త్రములచేత బాధింపఁబడి గంగాస్నానాదులు పవిత్రత్వసంపాదకములు కావని చెప్పు చున్నవి. భాగవతము దశమస్కంధోత్తరభాగము.

శ్లో. యస్యాత్మబుద్ధిః కుణపేత్రిధాతుకే స్వధీః కళత్రాదిషు భౌమ ఇజ్యధీః
యత్తీర్థబుద్ధిశ్చ జలే నకర్హిచి జ్జనే ష్వభిజ్ఞేషు సఏవ గోఖరః.
అని చెప్పియున్నది....

శ్లో. ప్రాణా యథాత్మనోభీష్టా భూతానామపి తే తథా
ఆత్మౌపమ్యేన భూతానాం దయాం కుర్వంతి సాధవః...

శ్లో. హయమేధశతసహస్రా ణ్యథ కురుతే బ్రహ్మఘాతలక్షాణి
పరమార్థవి న్నపుణ్యై ర్నచపాపై స్స్పృశ్యతే విమలః...

శ్లో. యథా సునిపుణ స్సమ్య క్పరదోషేక్షణే రతః
తథాచే న్నిపుణ స్స్వేషు కో నముచ్యేత బంధనాత్...

శ్లో. మాంసపాంచాలికాయాస్తు యంత్రలోలేంగపంజరే
స్నాయ్వస్థిగ్రంథిశాలిన్యా స్త్రియః కిమివ శోభనం...

శ్లో. త్వఙ్మాంసరక్తబాష్పాంబు పృథక్కృత్వా విలోచనే
సమాలోకయ రమ్యంచే త్కిం ముధా పరిముహ్యసి...

శ్లో. మేరుశృంగతటోల్లాసి గంగాజలరయోపమా
దృష్టా యస్మిన్ స్తనే ముక్తాహారస్యోల్లాసశాలితా
శ్మశానేషు దిగంతేషు సఏవ లలనా స్తనః
శ్వభి రాస్వాద్యతే కాలే లఘుపిండ ఇవాంధసః

కేశకజ్జలధారిణ్యో దుస్స్పర్శా లోచనప్రియాః
దుష్కృతాగ్నిశిఖా నార్యో దహంతి తృణవన్నరం...

శ్లో॥ అద్యజాతాం యథా నారీం తథా షోడశవార్షికీం
శతవర్షాంచ యో దృష్ట్వా నిర్వికార స్స షండకః...

శ్లో॥ భిక్షార్థ మటనం యస్య విణ్మూత్రకరణాయచ
యోజనా న్నపరం యాతి సర్వథా పంగురేవ సః...

శ్లో॥ తిష్ఠతో వ్రజతో వాపి యస్య చక్షు ర్న దూరగం
చతుర్యుగాం భువం ముక్త్వా పరివ్రా ట్సోంధ ఉచ్యతే...

శ్లో॥ హితం మితం మనోరామం వచ శ్శోకాపహంచ యత్
శ్రుత్వా యో నశృణోతీవ బధిర స్స ప్రకీర్తితః...

శ్లో॥ సాన్నిధ్యే విషయాణాంచ సమర్థో౽వికలేంద్రియః
సుప్తవ ద్వర్తతే నిత్యం భిక్షు ర్ముగ్ధ స్స కీర్తితః...

శ్లో॥ ననిందాం నస్తుతిం కుర్యాత్ నకంచి న్మర్మణి స్పృశేత్
నాతివాదీ భవేత్తద్వత్ సర్వత్రైవ సమోభవేత్...

చక్షురాది జ్ఞానేంద్రియములను వాగాది కర్మేంద్రియములను నాయాగోళములను ... మూయుట ... చేత నిరోధించినట్టు చిత్తమునుగూడ నిగ్రహించెదనని మూఢునికి భ్రాంతిగలుగును గాని యాప్రకారము నిరోధింపఁబడదు. చిత్తముయొక్క గోళము హృదయము. అది శరీరములోపల నాభికిమీఁద జేనయెత్తునఁ గంఠమునె ముకముఁ గ్రిందుగా నుండును. 8 దళములుగల తామరపూవువలె నుండి యధోముఖముగా వ్రేలుచుండును. ఇట్టిహృదయము మూయుటకు శక్యముగానుండదు కనుక గోళనిరోధము చేతఁ జిత్తనిరోధము శక్యముకానేరదు... పరస్త్రీసంపర్కము నిషిద్ధము. స్వస్త్రీసంపర్కమును ఋతుకాలమందుఁ దప్పఁ దక్కినకాలమందు నిషిద్ధము. ఇట్టి నిషిద్ధస్త్రీసంపర్కము చేయకయుండుటయే బ్రహ్మచర్యమని... శౌచము సంతోషము తపస్సు స్వాధ్యాయము నీశ్వరప్రణిధానము... నియమములనఁబడును. శౌచమన శుద్ధి. ఇది బాహ్యశౌచమనియు నాంతరశౌచమనియు రెండువిధములు. మూత్రపురీషోత్సర్జనకాలములయందు శాస్త్రోక్తప్రకారము ... కరపాదా ద్యవయవములఁ గడిగికొనుట...స్నానముచేయుట హిత మిత పవిత్రాన్నభక్షణము బాహ్యశౌచమనఁబడును. మైత్రీకరుణాది శుభవాసనలచేత మనస్సుయొక్క మలమును శోధించుట యాంతరశౌచమనఁబడును. తత్కాలమందుఁ దనకుఁగల భోగోపకరణములకంటె నధికమైన భోగోపకరణములఁ గోరని చిత్తవృత్తి సంతోషమనఁబడును...కాష్ఠమౌ నాకారమౌనాది వ్రతములు తపస్సని చెప్పఁబడును. కాష్ఠమౌన

మనఁ దన యభిప్రాయము సంజ్ఞచేతనైనఁ దెలియఁజేయకపోవుట. ఆకారమౌన మన వాఙ్మాత్రనిరోధము. ప్రణవము జపించుటగాని మోక్షశాస్త్రము నధ్యయనము చేయుటగాని స్వాధ్యాయమనఁబడును. తనచేఁ జేయఁబడు సకల వైదిక లౌకిక కర్మల ఫలము నపేక్షింపక వానిని...పరమేశ్వరునియందు సమర్పించుట యీశ్వర ప్రణిధానమనఁబడును. ఈ 5 జన్మాంతరహేతువులగు కామ్యధర్మములనుండి నివారించి మోక్షకారణమైన నిష్కామధర్మములయందు... ప్రవర్తింపఁజేయును... వాగింద్రియము లౌకికమనియు వైదికమనియు రెండువిధములు. అందు వ్యర్థప్రలాపము లౌకికమనియు...పంచాక్షరప్రభృతి మంత్రజపము వేదపారాయణము మొదలగునవి వైదికమనియుఁ జెప్పఁబడును. లౌకికము...చిత్తవిక్షేపకరమైనందున యోగికి సర్వదా త్యాజ్యము...

శ్లో. తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున!...

అనేకజన్మలలో యోగము నభ్యసింప సిద్ధిగలుగును. తరువాత మోక్షము పొందును...ఒకశిష్యుఁ డొక గురుసన్నిధి శాస్త్రాభ్యాసము చేయుచు... ఒక యెలుక బొక్కలోఁ జొరఁబడుచుండ దానినే చూచుచుండెను. గురు వర్థమంతయుఁ జెప్పి చొచ్చెనాయని శిష్యు నడిగెను. నేను జెప్పిన శాస్త్రార్థము నీబుద్ధిలోఁ జేరెనాయని...అభిప్రాయము. అందులకు శిష్యుఁ డెలుకనే చూచుచున్నందున నింకను దోఁక చొరలేదని ప్రత్యుత్తరము చెప్పెను. కనుక నాదరములేకుండఁ జేయు కార్యము సిద్ధింపనేరదు...పుత్రకళత్రాదినాశరూపమైన యాపదయు దారిద్ర్యముఁ బుత్రజన్మాదులవలనఁ గలుగు నుత్సాహము ధనికత్వపాండిత్యాదులవలనఁ గలుగు గర్వము నలసత్వము వివాహాదిమహోత్సవదర్శనమువలనఁ గలుగు హర్షము నేపురుషునియందు సంగతములు కావో యివి యేపురుషుని వైరూప్యము పొందింపనేరవో యాపురుషునిమనస్సు నశించినదియని తెలియవలయును...

శ్లో॥ గవాం సర్పిశ్శరీరస్థం నకరోత్యంగపోషణం
తదేవ కర్మరచితం పునస్తస్యైవ భేషజం.

నెయ్యి గోవుల శరీరమందు సహజముగా నున్నప్పటికి వాని శరీరము పోషించుట కుపయోగింపదు, పాలు పితికి కాచి పెరుగుఁజేసి మధించి వెన్నతీసి కాచిన పక్షమందా నెయ్యియే దేహపోషణమునకు వైద్యమునకు... ఉపయోగించును.

శ్లో॥ ఏవం సర్వశరీరస్థ స్సర్పివత్పరమేశ్వరః
వినా చోపాసనాం దేవో నకరోతి హితం నృప...

ఇందుచేత జీవాత్మ...పరమాత్మాభిన్నుఁడైనప్పటికిఁ బరమాత్మాభేదసాక్షాత్కారము కలిగిననే కాని జీవాత్మకుఁ బరమానందస్వరూపప్రాప్తి కలుగనేరదని తెలియఁదగినది.

శ్లో॥ ఏకకాలం చరే ద్భైక్ష్యం నప్రసజ్జేత విస్తరే
భైక్ష్యే ప్రసక్తోహి యతి ర్విషయేష్వపి సజ్జతి

శ్రు॥... భిక్షు స్సువర్ణాదీనాం నైవపరిగ్రహేత్ ...

శ్రు॥... యస్మా ద్భిక్షు ర్హిరణ్యం రసేన దృష్టంచే త్స బ్రహ్మహా భవేత్ ...స్పృష్టంచే త్సపాల్కసో భవేత్ ...తస్మాత్ ...నగ్రాహ్యం.

శ్లో॥ బ్రహ్మ నాస్తీతి యోబ్రూయాత్ ద్వేష్టి బ్రహ్మవిదంచ యః
అభూతబ్రహ్మవాదీచ త్రయస్తే బ్రహ్మఘాతుకాః.
బ్రహ్మహా సతు విజ్ఞేయ స్సర్వకర్మబహిష్కృతః...

శ్లో॥ పత త్యసౌ ధ్రువం భిక్షు ర్యస్య భిక్షో ర్ద్వయం భవేత్
ధీపూర్వం రేత ఉత్సర్గః ద్రవ్యసంగ్రహఏవచ...

—♦ బ్రహ్మవిద్య ♦—

ఇది యొక వేదాంత మాసపత్రిక. చందా సం॥ కు 1-4-0 8 మాసముల నుండి ప్రచురింపఁ బడుచున్నది. భగవద్గీతకు భావార్థప్రకాశికయని యొకటి యిందుఁ బ్రకటింపఁబడియెడిని.

—♦ విప్రకులదర్పణము ♦—

ఇం దాంధ్రబ్రాహ్మణ కుటుంబచరిత్రములు పశ్చిమ గోదావరిజిల్లా తణుకు తాలూకా కంతేటిగ్రామమునుండి నెలకు రెండుసారులు సత్తిరాజు సీతారామయ్యగారిచేఁ బ్రచురింపఁబడుచుండును. చందా 5-0-0. సీతారామయ్యగారీచరిత్ర మంతయు గ్రంథరూపముగనే వ్రాసియయ్యుది యతివ్యయప్రయాససాధ్యమగుటఁ బక్షపత్రికగాఁ బ్రచురించు చున్నవారు. మాసచతుష్టయమునుండియే ప్రకటింపఁబడు నీపత్రిక మంచిపేరులు మనకుఁ దెలియకున్నను "...విప్రకులదర్పణమునందలి కొన్ని భాగములను గ్రంథకర్తవలన విని...మిక్కిలి యానందించితిమి. సీతారామయ్యగారు చిరకాలము శ్రమచేసి బహుగ్రంథములు శాసనములు శోధించి యీగ్రంథము రచించిరి. ఈగ్రంథమందుఁ దెనుఁగుదేశమందుఁగల నియోగులయు వైదికులయు శైవులయు వైష్ణవులయు మాధ్వులయు యాజ్ఞవల్క్యులయు వంశము లింటిపేరులతో గోత్రములతోఁ బ్రవరలతో ... వర్ణింపఁబడియున్నవి. ఆయావంశములలోఁ బూర్వకాలమున నేఁటికాలమునఁ బ్రసిద్ధినొందిన పురుషుల చరిత్రములు సంగ్రహముగా సోదాహరణముగా లిఖింపంబడియున్నవి. ఆంధ్రబ్రాహ్మణుల కందఱకు నిది యుపయుక్తమైన గ్రంథము" అని సుప్రసిద్ధాంధ్రకవులగు వడ్డాది సుబ్బారాయఁడుగారి యొక్కయుఁ జిలకమర్తి లక్ష్మీనరసింహముగారి యొక్కయు నభిప్రాయములనుబట్టి యెఱుంగ

వచ్చును. ఆరాధ్యులైన యజ్జరమువారు శ్రీవైష్ణవులైన తిరుమలవారు మున్నగువారి చరిత్రలిప్పటికిఁ బ్రకటితములు. ఈసందర్భములోఁ బండితరాయలు తాతాచార్యులు లోనగువారి పూర్వోత్తరములు వర్ణితములు.

—♦ సు బో ధి ని ♦—

ఇది ప్రతిశనివారముఁ బ్రకటితమగు వార్తాపత్రిక. సంపాదకుఁడు మన్నేపల్లి రామకృష్ణరావుగారు, నెల్లూరు. చందా సం॥కు 2-8-0 ఇప్పటి కైదు సం॥ లనుండి వెలువడుచున్నది. కేవల దేశీయ రాజకీయ సాంఘిక వార్తాప్రకటనమే కాక గ్రంథ విమర్శనములు మొదలైన వానిద్వారమున నీపత్రిక భాషాసేవగూడ బాగుగాఁ జేయుచున్నది.

—✻ యు గ ం ధ ర ✻—

ఈపత్రిక 10 సం॥ల నుండి ప్రతిశనివారముఁ బ్రకటింపఁబడుచున్నది. చందా సం॥కు 3-8-0 మహాపురుషుల జీవితములు మొదలైనవి మంచిగాఁ బ్రచురించెడిని. సనాతనమతరక్షణమునుగూర్చి చాల నీపత్రిక పోరాడుచున్నది- ఏలూరు.

—♦ లో క లు బో ర్డు ♦—

ఇది మాసపత్రిక-సంపాదకుఁడు చాగంటి శేషయ్యగారు. ఆంధ్రదేశములోని పంచాయతీబోర్డు లీపత్రికకుఁ జందాయిచ్చి తెప్పించుకొనవచ్చునని గవర్నమెంటువారు జీవోను జారీచేసియున్నారు. 5 సం॥ల నుండి ప్రకటింపఁబడుచున్నది. చందా సం॥కు 3 రూపాయలు. చిరునామా, ప్రొప్రయిటరు, లోకలుబోర్డు, కపిలేశ్వరపురము, తూర్పుగోదావరిజిల్లాయని, పంచాయతిబోర్డుల కిది చాల ముఖ్యము. ఆపంచాయతిపరిపాలనమునుగూర్చిన విషయములు మొదలైనవే యిందు విశేషము ప్రచురింపఁబడెడిని. పంచాయతిబోర్డు లున్నను బల్లెటూళ్ళలోఁ బ్రజారోగ్య ప్రదములగు పనులు బాగుగాఁ బరికింపఁ బడుటలేదు. అవిషయ మిం దెట్లు విస్పష్టమో చూడుఁడు.

...ప్రతిపల్లెయూరునందును మలవిసర్జనమునకుఁ దగినయేర్పాటు చేయకపోవుటచే నపరిశుభ్రతయు ననారోగ్యము హెచ్చుగుచున్నవి. కొలగారము పాటవలనను బచ్చుగడ్డి యెండిపోయినచెట్ల వేలమువలనను బంచాయతీలులేని గ్రామములలోఁ గూడఁ గొంత యిమ్మడిసొమ్ము జమచేయఁబడుచున్నది. కాని, యాసొమ్ము ప్రజల యారోగ్యమునకై ఖర్చుపడుటలేదు. దేవతోత్సవములకును సంధు బోగముమేళములకును ఖర్చుపడిపోవుచున్నది. పల్లెటూళ్ళలోనుండు నాయకులు వానికి ఖర్చుచేయుట కంగీకరించినంత సులభముగాఁ బ్రజల యారోగ్యమునకు ఖర్చుపెట్టుట కంగీకరింపరు. ప్రజల యారోగ్యవిషయము వారి హృదయములయం దంకురించియుండినచోఁ జాలకాలముక్రిందటనే...స్త్రీలైనను మలవిసర్జనము చేసికొనుటకుఁ దగిన యవకాశములు కల్గించియుండెడివారు. ఈవిషయమునఁ బల్లెటూళ్ళ స్థితి చాల

హీనముగ నున్నది. ... చెఱువుగట్లును గాలువగట్లును మనుష్యులుఁ బశువులు నడచు పుంతలును గ్రామముచుట్టు నుండు ఖాళీప్రదేశములును మలవిసర్జనప్రదేశములుగ నుపయోగపడుచున్నవి...కొన్ని డెల్టా గ్రామములలోఁ బందులమలమును జేఁపల పొట్టును గుల్లిన చేఁపలను నెరువుగా నుపయోగించుటకు రయితు లలవాటుపడియున్నారు. కాలము గడచినకొలఁది మనుష్యమలసంబంధమైన మట్టియు నెరువుగా నుపయోగింపఁబడవచ్చును. ఎట్లయినను బల్లెటూళ్ళలో మలపరిష్కార మొక పెద్ద సమస్యగా నున్నది. పంచాయతీలును జిల్లాబోర్డులును గ్రామప్రజలును నీవిషయమై శ్రద్ధవహించి తగినయేర్పాట్లను గావించుట యావశ్యకమైయున్నది.

దేవాలయ ప్రవేశము

(గోవిందరాజు హరిశ్చంద్రరావు గారు)

కమలాకరభట్టనిర్మితమైన నిర్ణయసింధుగ్రంథమునఁ దృతీయపరిచ్ఛేదమున హయశీర్షపంచరాత్రమను నాగమమునుండి "చండాలమద్యసంస్పర్శదూషితా వహ్నినాథవా, అపుణ్యజనసంస్పృష్టా విప్రక్షత్రజదూషితా" అను శ్లోకము గ్రహింపఁబడినది. పిమ్మట బద్ధాదర్శగ్రంథమునఁ జూపఁబడిన

శ్లో॥ ఖండితే స్ఫుటితే దగ్ధే భ్రష్టే మానవివర్జితే
యాగహీనే పశుస్పృష్టే పతితే దుష్టభూమిషు
అన్యమంత్రార్చితేచైవ పతితస్పర్శదూషితే
దశ స్వేతేషు నోచక్రు స్సన్నిధానం దివౌకసః.

అను బ్రహ్మపురాణవాక్యమును నిర్ణయసింధువు పేర్కొనుచున్నది. సిద్ధాంతశేఖరమను గ్రంథమందలి

శ్లో॥ చోరచండాలపతితశ్వోదక్యాస్పర్శనేసతి
శివా ద్యుపహతౌచైవ ప్రతిష్ఠాం పునరాచరేత్

అను పద్యమొకటి కమలాకరభట్టు వ్రాసియున్నాఁడు. శుద్ధిప్రకారమును దెల్పు శుద్ధివివేకమను గ్రంథమునఁగల "ద్రవ్యవత్కృతశౌచానాం దేవతార్చానాం భూయః ప్రతిష్ఠాపనేన శుద్ధిః" అను విష్ణువాక్యమును బ్రదర్శించియున్నాఁడు. దీనియర్థము. "అర్చాః ప్రతిమాః, తద్ద్రవ్యస్య తామ్రాదేః ఉక్తశౌచం కృత్వా పునః ప్రతిష్ఠాం కుర్యాత్" అనివచించియున్నాఁడు. కృష్ణభట్టు నిర్ణయసింధువ్యాఖ్యయందు **1250, 1251** పుటలలో "సంప్రోక్షణవిధానేన కుర్యాదేవ మతంద్రితః, స్థానసంచలనేవాపి శవసూతకిసంస్పృశే, చండాలపుల్కసోదక్యాపతితాద్యభిమర్శనే, విణ్మూత్రస్పర్శనే వాపి ఖరోష్ట్రాదిభిప్రవేశనే, సంతతార్చనలోపేపి అంగారస్పర్శనేపివా, ఏవమాద్యేషు జాతేషు తదా సంప్రోక్షయే ద్గురుః, సంప్రోక్షణవిధానేతు సకాలనియమ స్తథా,

శుణ్యోహం వాచయిత్వాచ బ్రాహ్మణై రుపచారయేత్" అను శ్లోకముల నిచ్చి యున్నాఁడు. ఈవిషయము మఱొకచో విస్తరింపఁబడియున్నది, ... మద్యము చేతను జండాలునిచేతను స్పృశింపఁబడినదియు నగ్నిచే దహింపఁబడినదియు విప్రరక్తసిక్తమైనదియు ... పాతకిచే స్పృశింపఁబడినదియు నగు విగ్రహము పునస్సంస్కారమున కర్హమగుచున్నది. ఖండితమైనను స్ఫుటితమైనను స్థానభ్రష్టమైనను బూజనాభావము గలిగినను శ్వగర్దభాదిస్పర్శనము సంభవించినను బతితరజస్వలాచోరులచే స్పృశింపఁబడినను బునఃప్రతిష్ఠ యొనరింపవలెను. ఖండితము భగ్నము నైనచో యథావిధిగా నుద్ధరింపఁదగు. అన్యము స్థాపింపనగును. అర్చాభంగచౌర్యాదులు సంభవించినపక్షమున నాఁటిదిన ముపవసింపవలెను. తామ్రాదిలోహమూర్తులకు మ్రుచ్చులు చండాలురు మొదలగువారి స్పర్శ సంప్రాప్తమైనచోఁ దామ్రాదిలోహములకుఁ జెప్పఁబడిన శుద్ధి నొనరించి పునఃప్రతిష్ఠ కార్యమగుచున్నది. పూర్వప్రతిష్ఠితమైనదానికిఁ బ్రమాదవశమున నేకరాత్రమో యేకమాసమో మాసద్వయమో యర్చనావిచ్ఛేద మైనయెడల లేదా శూద్రరజస్వలాద్యుపస్పర్శము కలిగినపక్షమున జలాధివాస మొనరించి కలశముతో స్నపనము గావింపవలయును. తరువాతఁ బంచగవ్యముతో స్నపనము నిర్వర్తించి యష్టసహస్రమో యష్టశతమో యష్టవింశతియో సంఖ్య పూర్తియగునటులఁ గలశములచే శుద్ధోదకమునఁ బురుషసూక్తపాఠసహితముగా స్నపనముజరుపవలెను. పిమ్మట గంధపుష్పాదులతో స్వామిని బూజించి గుడౌదనమును నివేదింపవలయు. అబుద్ధికముగా జరిగిన దోషమున కిది శుద్ధి... బుద్ధిపూర్వముగా సంభవించిన పూజావిచ్ఛేదమందును శూద్రస్పర్శాదులందును బునఃప్రతిష్ఠచేతనే శుద్ధియగునుగాని స్వల్పప్రాయశ్చిత్తము చాలదు. ఒకదినమునఁ బూజాభంగమైనచో ద్విగుణముగాఁ బూజయొనరింపవలెననియు రెండురాత్రులైనయెడల మహాపూజసేయవలెననియు రెండురాత్రులు మొదలు మాసమువఱకు నైనపక్షమున సంప్రోక్షణము జరుగవలెననియు మాసము మించినయెడలఁ బునఃప్రతిష్ఠ గాని ప్రోక్షణవిధిగాని కార్యమనియుఁ గొంద ఱనుచున్నారు. పునఃప్రతిష్ఠాదికము శూన్యమాసము శుక్రమౌఢ్యము మొదలగు నాటంకము లేనిదై యెల్లప్పుడును జేయఁదగినది. "మద్య మంటినను జండాలుఁడు స్పృశించినను వహ్నిచే దగ్ధమైనను బ్రాహ్మణుని రక్తమంటినను బాపాత్ముఁడు ముట్టినను దేవప్రతిమ తిరుగ సంస్కరింపవలెను. రాగిమొదలగు ధాతుమూర్తులకుఁ జోరచండాలాది స్పర్శ మైనచో నాలోహపాత్రకుఁజెప్పిన శుద్ధిఁ జేసి పునఃప్రతిష్ఠఁ జేయవలెనని విజయనగరసంస్థానమువారి ప్రేరణమునఁ గొల్లూరు కామశాస్త్రిగారిచే రచింపఁబడిన యాంధ్రానువాదము 500 పుట. శ్రీనివాసదీక్షితకృతమైన వైఖానసతాత్పర్యచింతామణి 253, 254 పుటల "దేవుని సన్నిధిని మానవు లందఱును దర్శనస్పర్శనాదుల కర్హు లగుచున్నా"రను వాదము ఖండింపఁబడినది... వైయాకరణపంచాననవిరచిత స్నపనవిధి... 89 పుట కలశమునకుఁ జండాలాదిసంస్పర్శనము గలిగినపుడు "కలశన్యాసే కృతే శ్వకాకాద్యస్పృశ్యస్పర్శనే కర్తవ్యం కలశ మాదాయ పూర్వవత్సంశోధ్య శాంతిం వైష్ణవంచ జుహుయాత్" అని విధించుచున్నది. ...అదిగాకనుట చేఁజండాలురు తగిలినను దోషము

కలదని గ్రహింపనగు. కలశస్పర్శమే కూడదనఁ బ్రతిమాస్పర్శమునుమాటఁ జెప్ప నక్కఱలేదుకదా! చండాలురు దేవాలయమునఁ బ్రవేశించినను బింబమును స్పృశించినను స్నపన మావశ్యకమగుచున్నదని యాతఁడు వాక్రుచ్చియున్నాఁడు...నీలకంఠాచార్యకృతమైన కారికావృత్తియందు

శ్లో॥ వైశ్యానామపి శూద్రాణాం భద్రమంటపసేవనం
ఇతరేషాంతు వర్ణానాం గోపురంతు విధీయతే.
చండాలపతితాదీనాం గోపురా ద్బహిరేవహి...

అని నిర్ణయింపఁబడియున్నది. అర్చనానవనీత...మున

శ్లో॥ శేషాణాం హరిభక్తానాం గోపురంతు విధీయతే
ప్రతిలోమాంత్యజాతానాం స్తూపం దృష్ట్వా సమాచరేత్...

అని వ్రాయఁబడియున్నది. దేవనభట్టవిరచిత స్మృతిచంద్రిక...అహ్నిక కాండ 541పుట నృసింహపురాణమునుండి "అపస్యషితిని శ్ఛిద్రై రస్పృష్టైశ్చాపి జంతుభిః। ఆత్మారామోద్భవైర్వాపి పుష్పైస్సంపూజయేద్ధరిం"...అను శ్లోక ముద్ధరింపఁబడినది. ఇట జంతుపదముచేఁ జండాలు రుపలక్షింపఁబడుచున్నారు.

డా॥ భగవాన్ దాసుగారి వర్ణాంతర వివాహపు బిల్లు విమర్శనము.

(ముడుంబ నరసింహాచార్యులుగారు)

...వర్ణవ్యవస్థమహాత్త్వము

వివిధవర్ణములవారి కన్యోన్యానురాగము కలుగుటకు మార్గమేది? సంబంధబాంధవ్యములు... కలిగించుటచే నది సాధ్యమగునా? సమానమనస్తత్త్వములు సమానాశయములుఁ గలవారికే పంక్తిభోజనములు వివాహసంబంధములుఁ బొసఁగునుగాని యన్యులకు విషమించునని భగవాన్ దాసుగారే యంగీకరించిరి. విరుద్ధమనస్తత్త్వములు గల వారితో సంబంధబాంధవ్యములవల్ల సఖ్యత హెచ్చుటకు మాఱు విరోధభావములే వృద్ధియగును. ఐకమత్యమనుమాట యబద్ధముకాని యట్టి సంబంధబాంధవ్యములవల్లఁ గొద్దికాలములోనే యున్నతజాతులందుఁగూడ మాంసభక్షణము మద్యపానము...మున్నగు దుర్వ్యసనములు పూర్తిగా సంక్రమించి హిందూసంఘమునందు మిగిలియున్న కొద్దిపవిత్రతకూడ నదృశ్యమగుట నిక్కము...కులపుఁ గట్టుబాట్లు కొంతవఱకైన సవ్యముగా జరుగుటచే జీవితకాలమంతయు మద్యమాంసములు చవిచూడనట్టియు సదాచారము...కలట్టియు నుత్తమకులము లెన్నియో హిందూజాతియం దిప్పటికిని గాన్పించుచున్నవి. హిందూదేశమునఁ దప్ప ప్రపంచమున మఱే ప్రాంతమందైనను నిట్టి నియమనిష్ఠలతో నొప్పు స్త్రీపురుషులుగల సంఘములు లేకుండుట వర్ణవ్యవస్థమహాత్త్వమును వేనోళ్ళఁ జాటుటలేదా?...వర్ణభేదములను దీసివేసి హిందువు లందఱిని సమానమగు పరిశుద్ధజీవనముగలవారినిగాఁ దయారుచేయుటకుఁ

దగిన కట్టుబాట్లు నేర్పఱచుట సాధ్యముకాదాయని కొందఱు ప్రశ్నింతురు. అట్టి పని జరుగుట యసంభవము. నవనాగరకులమనువారు పెక్కుమంది సంస్కారములను పేర జనుల నియమనిష్ఠలను జెఱచి సంఘము నధఃపతనము చేయుచున్నారే కాని దాని పవిత్రతను గాపాడయత్నించుచున్నారా ? అదిగాక యట్లందఱికిని నియమనిష్ఠలను గలిగించుట యెప్పటికిని సాధ్యమగుపని కాదు. వితంతూద్వాహము లున్నతకులములలో లేవుకదా ! వారివలెఁ గ్రిందికులములవారును వితంతూద్వాహముల నిషేధించుటకుఁ బూనుకొనఁగలరా ? ఇప్పు డగ్రవర్ణములవారిలోఁ గూడ వితంతూద్వాహముల నేర్పఱచుటే గొప్పసంస్కారముగ నవనాగరకులు భావించుట మనము చూచుటలేదా ?

రజస్వలావివాహములు నిషిద్ధములని శాస్త్రములు ఘోషించుచుండఁగా మన నవనాగరకు లిఁకన్నియు నట్టి నిషిద్ధవివాహములే జరిపించుటకుఁ బూనుకొని యందుకుఁ జట్టుపుసహాయము పొందలేదా? ఇపుడు...దాసుగారు ప్రతిపాదించిన క్రొత్తశాసనము నభిప్రాయమేమి! వర్ణాంతరవివాహములు నిషేధించుట నేరమనికదా! దీనివలన నేమియేర్పడుచున్నది? ఒకపంచముఁ డొక బ్రాహ్మణయువతిని వివాహమాడును. అప్పుడు బ్రాహ్మణసంఘ మాయువతిని వెలివేయరాదు. అట్లువేయుట నేరమగును. పంచమునితోఁ గాఁపురము చేయు బ్రాహ్మణయువతి యింటి కామె తలిదండ్రులు నన్నదమ్ములు బంధువులు మొదలగువారందఱు నెట్టియరమరిక లేక శుభాశుభములకు వెళ్లి యన్నపానాదులం గుడుచుచుండవలె...ఇంకను మాంసాహారనిర్బంధశాసనము రాలేదుకనుక వారు పెట్టినయాహారములో మద్యమాంసాదులు...న్నయెడల నవి తీసి దూరముగాఁ బెట్టి మిగిలినవే భక్షించివచ్చుటకుఁ గొంత యవకాశమున్నదఁట. కటకటా! ఇంతకన్న ఘోరాతిఘోరమగు చట్టము మఱేముండును? దేశోన్నతికొఱకు యత్నింపవలసిన శాసనసభ్యులు కొద్ది తాత్కాలికోపయోగ మేదో మదినెంచి యింత విరుద్ధఫలదాయకములగు చట్టములను బ్రవేశపెట్టుట యెంత దేశారిష్టదాయకమో దీనివల్ల నుత్తమకులముల నియమనిష్ఠల కెంతభంగకరమో చదువరు లూహింపుఁడు. ఇట్టి సంకరవివాహములవలన స్నేహ మభివృద్ధియగునని డాక్టరుగా రూహించుచున్నారుకాని యిదవఱకుఁ గని విని యెఱుఁగని క్రొత్తకలఁతలుకూడఁ బ్రారంభమై హిందూసంఘము సంక్షుభితమైపోవుట నిశ్చయము. వెంటనే యీబిల్లు...నుపసంహరించుకొనుట యుక్తము...

←♦ ఉ ఱు ము లు ♦→

ఈ సం॥ మొదటి 6మాసములు నబీసీనియాయుద్ధముతో సరిపోయినది. కేవల మిటలీ యబీసీనియాలకు సంబంధించినదైనను నాయుద్ధజ్వాలలు యురపుఖండమునంతను నలముకొనునేమో యని రాజ్యము లన్నియుఁ దహతహలాడిపోయినవి. ఫ్రాన్సు పక్షపాతపూర్వకమైన యుపేక్షయు నింగ్లాండు దూరదృష్టితోఁగూడిన నిగ్రహము నన్యోన్యముఁగలిసివచ్చుటచే నాగండము తప్పిపోయినదికాని లేనియెడల

నీపాటికిం బశ్చిమగోళమంతయుం బ్రచండప్రళయమునం జిక్కుకొని మహాభీకరస్థితియం దుండెడిది...అబ్సీనియా యుద్ధము ముగియుటతోడనే యురపునకుం గొంత కాలమైనను విశ్రాంతి చేకూరునని తలంచితిమి. కాని...వేనికవి...సైన్యముల నినుమడింపంజేసికొన నారంభించినవి.

సర్వత్ర యుద్ధసన్నాహ మపూర్వరీతిని విజృంభింపమొదలిడెను. ఆపత్కాలములో సోదరరాజ్యము లాదుకొనంగలవను నమ్మకము పోయినది...యుద్ధసన్నాహమే శాంతిపోషకమను నసురసిద్ధాంతము తిరిగి తలయెత్తినది...సమస్తరాజ్యములు నేకమై తనపైం గత్తిదూసినను వానినెల్లం బాతాళలోకమున కణంగంద్రొక్కి యవి యెన్నటికిని దిరిగి తలయెత్తకుండ భూస్థాపితము చేయంగలనని... రష్యా దశదిశలు మాఱుమ్రోంగునట్లు భీకరస్వరముతో గద్దించుచున్నది...అన్ని దేశములలో యుద్ధకార్యమే ప్రధానపరిశ్రమయైనది. నేండు యురపియను రాజ్యతంత్రజ్ఞులకు రణనీతితప్ప వేఱులక్ష్యము లేదు...సకలవ్యవహారములు సకలవ్యాపారములు యుద్ధముఖము దాల్చుచున్నవి. దయ...దానము ధర్మము మొదలగు మానవలక్షణము లిప్పు డెచ్చటను గన్పట్టవు. శక్తి యధికారము...ప్రాబల్యము ధిక్కారము విధ్వంసము...మొదలగు దురహంకార...లక్షణములు సర్వత్ర పూర్తిగం బ్రకోపించినవి...సర్వనియంతృత్వాధికారములేని సేనాధిపతిత్వ మిప్పు డెచ్చటను లేదు. తుద కింగ్లాండులోం గూడ...ఇంక యుద్ధ మెట్లు సంఘటింపకుండ నుండంగలదు? కాని ముం దేరూపమున నేపరిమాణమున బయలు వెడలునోయని యెల్లరును వితర్కించుచుండిరి. వివిధరాజ్యములకుం గల సరిహద్దుల తగాదాలు యుద్ధకారణములగునేమోయను నూహ కలిగెను. జర్మనీవారి...ఆక్రమణ మీయూహ నొకింత బలపఱచినది. కాని లోకవృత్తము మఱియొకదారి తీయసాగినది. సరిహద్దుల తగాదాల నేదోవిధముగాం బరిష్కారము చేయవచ్చును. జర్మనీకి దాని...ఇచ్చివేయవచ్చును. ఆస్ట్రియా విషయ మేదోవిధముగం బరిష్కారమైనది...కాని యీస్వల్పసంస్కరణములతో యురపునకు శాంతిభద్రములు చేకూరునట్లు లేదు...అబ్సీనియా యుద్ధము కేవల మన్యదేశాక్రమణమునకు సంబంధించినవిషయము...చరిత్రవిరుద్ధమైన విషయము కాదు. పరదేశాపహరణము చేయని సామ్రాజ్యమే లేదు. ఇటలీ యీనీతినవలంబించియే యబ్సీనియాను బలవంతముగ భుక్తపఱచుకొనినది. ఈవిషయమై యితరరాజ్యము లంతగం దగాదాపడవలసిన పనిలేదు...ఇటలీసామ్రాజ్యోన్మాదము పెచ్చుపెరింగి యితరరాజ్యముల...భంగము గలిగించునను భీతితప్ప వేఱేమియు లేదు. ఆకారణముచే నావిషయము...తీరిపోయినది. ఆదావానల మిటలీనిముంచి వ్యాపించకుండం జేయంబడినది...ఫ్రాన్సు నింగ్లాండు మొదలగు దేశములవా రెంతో పాటుపడుచున్నారు. ఏదోయొక పార్టీ నిశ్శేషముగ హతమగునంతవఱకు నీజ్వాలచల్లారదు. చల్లారనీయరు. ఇటలీ జర్మనీ...ప్రభుత్వములు ప్రత్యక్షముగం బితూరిదారులకు సర్వవిధములం దోడ్పడుచున్నవి. ఫ్రాన్సునుండి వాలంటీర్లెందఱో ప్రభుత్వపక్షమునం జేరి పోరాడుచున్నారు...ప్రభుత్వపక్షమున నాపదలపాలైన దీనులసహాయార్థమను పేరుతో రష్యాలోం బెద్ద నిధి సమకూర్పంబడు

చున్నది. యూరపంతయు నీకలవరమును సన్నిహితవిషయముగ నెంచుకొనుచున్న దనుటకు వేఱుతార్కాణము లవసరములేదు... ఏమియైనను నేదేశమువా రాదేశము భవితవ్యమును నిర్ణయించుకొనుటకు సంపూర్ణస్వాతంత్ర్య ముండవలెను. బయటివారు జోక్యముగల్పించుకొనుట యనర్థదాయకము. కాని యిటలీజర్మనీలు ప్రత్యక్షముగ నీపితూరీదారులను బురికొల్పుచున్నవి. హిట్లరుగారి యుస్మాకపుగర్జనల నాలకింపుఁడు... తానొక కేకవేసినంతమాత్రమున జర్మనీనేల యంతయు సేనల నీని తనప్రక్కను నిలుకఁబడునఁట! తనదేశమును దగులఁబెట్టుకొననిండు. ఇతరదేశములతోఁ దనకేమిజోక్యము? ఈతఁడు ప్రపంచమున కంతకు నియంతయగుటకుఁ గోరుచున్నాఁడు... రష్యాపైఁ గత్తిదూయుచు నియ్యది లోకశాంతిసంరక్షణముకొఱకని యూఱుముచున్నాఁడు. ఎటులైనను రష్యాసంధిని ద్రెంచివైచి యిటలిజపానుల సహాయముతోఁ దూర్పుదిక్కున దాడిసాఁగింప నిశ్చయించినాఁడు. ఈయుద్ధ మీ సం॥ ముగియులోపలఁ బ్రారంభము కాకపోవచ్చును. పైయేటికిఁ దప్పనిదానివలెఁ గనపడుచున్నది. వ్యక్తిస్వాతంత్ర్య నిర్మూలకమైన జాతీయసైనిక నియంతృత్వమా? లేక ప్రజాస్వామిక సమ్మతమైన యంతర్జాతీయధర్మమా ? ఈవిషయము త్వరలోఁ బరిష్కారముకాక తప్పదు.

(కృష్ణ)

—* ఇష్టకామేశ్వర స్తవము *—

(సహస్రావధాని జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు.)

సీ. నీమైత్రినేకదా నిక్షేపముల నొందె
అలకాపురీశ్రిత యక్షనేత !
నినుఁగొల్చియేకదా నిశితాశసిం జెందె
స్వర్గజగచ్చారి పాకవైరి !
నీసమ్మతింగదా శ్రీసుదర్శన మందె
అరిమండలవిదారియైన శౌరి !
నినుఁదన్పియేకదా యొనసెఁ బాశుపతంబు
సంగరజయరోచి సవ్యసాచి !
నీమహత్త్వంబు నెఱఁగి ధ్యానించువాని
వేడ్కలీయక యెపుడు పంపించినావు
హృద్య బాలాత్రిపురసుందరీ హృదీశ !
కామపలి యిష్టకామేశ ! శ్రీమహేశ !

సీ. నినుఁగొల్చియేకదా నీరధిం దిగఁద్రావె
  కాలవిజ్ఞాని యగస్త్యమౌని !
నినుఁగొల్చియేకదా నీరధి బంధించె
  రావణాంతకవృత్తి రామమూర్తి !
నినుఁగొల్చియేకదా నిఖిలశత్రుల గెల్చె
  అస్త్రవిద్యాపేటియగు కిరీటి !
నినుఁగొల్చియేకదా నిపుణత ఘటియించె
  అఖిలభూనిర్మాతయైన ధాత !
నిన్ను దైవమ్ముగాఁగ ధ్యానించునట్టి
మమ్ముఁ బ్రోవఁగ నీచింతనమ్ములేల? హృద్య॥

సీ. త్రిపథగాభరణమ్ము తెలుపదా మఱి లేద
  త్రిదశాలయముగావ దీప్తిచేవ ?
త్ర్యంబకస్ఫురణమ్ము తనుపదా మఱిలేద
  స్థిరముక్తికిం ద్రోవ త్రిదశసేవ ?
రేఖాత్రయమ్ము నేర్పింపదా మఱిలేద
  త్రిగుణజయోద్ధతి ప్రీతిభాతి ?
సృష్టిస్థితివినాశ మెఱిగింపదా లేద
  స్తవ్యత్రిశూలమ్ము ధారణమ్ము ?
అంతకును నీదు మూర్తిత్రయాత్మకత్వ
మరయనేరనివారి నేమనఁగవచ్చు?- హృద్య॥

సీ. ఏచండశాసన లోచననిచయమ్ము
  భయదానలప్రభా భాసితంబు
ఏనవ్యమోహిని యాననాబ్జముడంబు
  భవదీయ తేజోవిభాసితంబు
ఏశుద్ధచారిత్ర హృద్యకేశభరంబు
  రవిసూను తేజోవిరాజితంబు
ఏధ్యేయ సౌందర్యమధ్యప్రదేశంబు
  బలవైరి తేజఃప్రభాసితమ్ము

ఆమహాసాధ్వి నీసాధ్వియై తలిర్ప
భర్తరిపుతమ మార్ప దుర్భరమె నీకు? హృద్య॥

సీ. ఆశ్రయించునుగదా యన్నివేళల నిన్ను
అంబకాంతర్వర్తి యగ్నిమూర్తి
సమయార్హమగు సేవ సల్పుచుండునుగదా
గణ్యచారిత్రుండు పుణ్యజనుఁడు !
సేవసేయునుగదా చేరి స్వార్థముఁబాసి
కంఠాహిభోజ్యుండు గంధవహుఁడు !
కైయూఁతయేకదా కపటనాటకమున
పృథులాపదలఁబాపు నీకురూపు !
భవదనంతస్వరూపవైభవము నరయ
అఖిలదిక్పాలకులును నీయందు లేరె? హృద్య॥

సీ. ఇరువదిచేతులు నెనయు దైత్యుఁడఁగాను
నీపర్వతము చేవ నూఁపివైవ
అంభోధి దిగఁద్రావనగు తపస్వినిగాను
నెత్తినంగల గంగ నిన్ను మ్రింగ
వరసంగ్రహణశీలి భస్మాసురుఁడఁగాను
కేరలి నీతలపైనఁ గేలుపూన
దశశతకరభాసి దనుజేంద్రుఁడనుగాను
ద్వారపాలకు క్రోవఁ బట్టివైవ
నిన్ను బంధింప నాకేమినేర్పు గలదు
స్వయముగా నీవె నన్నేలవలయుఁగాక. - హృద్య॥

సీ. వరుణుండు భవదంశభవుఁడని నుడువదా
కలుషాదనాచార గాంగధార !
అలకాధిపతి భవదంశమంచనుఁగదా
ఫణిఫణామణిజాల భాసులీల !
అమరేశ్వరుండు నీయంశమంచనుఁగదా
కలధౌతగిరిచెల్మి నిలుచుకల్మి !

యముఁడు త్వదీయాంశమని వచించునుగదా
ప్రళయకాలాభీల చలనలీల !
దిక్పతులు భవదంశావతీర్ణులనుచు
నీనురూపమ్ము తెల్పదే నేర్పరులకు - హృద్య॥

సీ. వరుణసంధిత శంఖపాటవాభీలంబు
చక్రిచక్రబలాభి సంధితంబు
చండహవ్యాశనశక్తిప్రపూర్ణంబు
వజ్రి వజ్రాయుధ పాతచణము
పవనకల్పిత ధనుర్బాణతూణీరమ్ము
పటుహిమాచల దత్తవాహనంబు
అలఘుపినాక దివ్యత్ప్రతాపభరమ్ము
స్థగితామరౌఘ తేజఃపటలము
త్వత్తనూగత లలితకాంతామహంబు
ఏమికావలె శ్రితునేల నింతకన్న? ॥హృద్య॥

సీ. ఏసతీతిలకంబు భ్రూలతాద్వితయమ్ము
ఉభయసంధ్యాప్రభావోదితమ్ము
ఏమహాసత్త్వాఢ్య మృదులదోఃపీఠంబు
విష్ణుతేజస్సమావిష్కృతంబు
ఏమహాగుణామాన్య మృదులాంఘ్రియుగళమ్ము
పద్మజతేజో విభాసితంబు
ఏలోకమానిత పృథుజఘనభరంబు
భూమిసమర్హ తేజోమహితము
ఆమహావీరమాత నీయందు నుండ
సాధురక్షణ మొనరింప శ్రమమె నీకు? ॥హృద్య॥

సీ. గోవుపాదముకన్న లావుగాఁదోఁచునే
ప్రాక్కర్మసంలబ్ధ భవమహాబ్ధి
గులకఱాఁ గుమికన్న గురువుగాఁదోఁచునే
భయదరూపంబు విపన్నగంబు

మశక తోఁదనకన్న నిశితమై తోఁచునే
వీపానదిరిపుజాల విజయలీల
కేళియే కాళ యాభీలమై తోఁచునే
అవినీతిపర రాక్షసౌఘశిక్ష

నీదునామమ్ము పఠియించు నిపుణమతికి?
అట్టి నీనామమునెడు భాగ్యమ్ము నిమ్ము
హృద్యబాలాత్రిపురసుందరీ హృదీశ!
కామపలి యిష్టకామేశ? శ్రీమహేశ!

యువసం॥ కార్తికమాసమున సత్తెనపల్లితాలూకా, ఉయ్యందనతాళ్లూరు గ్రామమందు శ్రీమ దన్నపూర్ణాభ్రమరాంబాసహిత శ్రీవిశ్వమల్లేశ్వరస్వామి యుత్సవసందర్భమున రచియించిన

—♦ న వ ర త్న ము లు ♦—

(కొప్పరపు గోపాలకృష్ణమూర్తి గారు)

శా॥ శ్రీశీతాచలపుత్రికాహృదయరాజీవార్క! భక్తార్తినా
శా! శీతాంశునిబద్ధసన్మకుటభాస్వచ్ఛీర్ష! లోకత్రయా
ధీశా! భావజరూపనాశన! కృపాబ్ధీ! తాళపూర్వావస! స
ర్వేశా! శేషవిభూష! మౌనినుత! తండ్రీ! విశ్వమల్లేశ్వరా!

మ॥ భవదీయాలయపుం బ్రదక్షిణము నీపై భక్తి నీమూర్తి దు
ర్భవనాశం బగునంచు నెంచి తిలకింపన్గల్గి మద్ఘోరపా
పవిభేదవ్యంబొనరించు; నంశయమిఁకన్ బాధింపఁగాఁజాలునే.
భవనాశా! దురితాటవీదహన! దేవా! విశ్వమల్లేశ్వరా!

సీ. పాపాంధకార దుష్పటలంబుఁ బాపదే
భవదీయసద్భక్తి భానురశ్మి
అజ్ఞానకాననం బాహుతిగాదె త్వ
ద్భక్తియనెడు దావవహ్నికలన

కామాదిషడ్రిపుజాకష్టంబు లడఁగవే
త్వద్భక్తియను నౌషధంబు గ్రోల
సంసారమను ఘోరసాగరంబును దాఁటఁ
బోవమే త్వద్భక్తినావ దొరక.
నీమహాపాదభక్తిచే నీమహిఁ దగఁ
గోరుకోర్కె లవెల్లను దీరుచుండ
ఖలులు కొందఱు నీకృపు గానఁబోవ
రెట్టినారకకష్టంబులేని గనుచు.

మ॥ దురితౌఘం బడఁగించి భక్తతతి నెంతో ప్రేమఁ జేపట్టి భా
సురమోక్షంబు నొసంగుచుండుటకునై శుభ్రస్థితిన్ హస్తమం
దరయ న్గంకణమొందు దాల్చు భీవదీయాంఘ్రి ద్వయాభ్యర్చనా
నిరతిం బూని యొనర్చి ధన్యతను గంటిన్ విశ్వమల్లేశ్వరా!

సీ. ఒకవంక భూసురనికరంబు సద్వేద
పారాయణంబు లొప్పార సలుప
ఒకక్రేవఁ బండిత ప్రకరంబు గ్రంథకా
లక్షేపములచేత లలిఁజెలంగ
ఒకచాయ దాసు లెంతో భక్తి గుమిగూడి
నామసంకీర్తనల్ నడపుచుండ
ఒకచక్కి నానావిధోద్యుక్త వాద్యసం
తానధ్వనుల్ మిన్ను దరియుచుండ
ఒకట మంత్రఘోష మొగి ప్రమోదయుఁ ద్వన్నిల
యంబు చూడ్కి కెంతో హర్షమిడుటఁ
గాంచువారి తనువు కడుపవిత్రముగాదె
తాళనగరవాస! దైత్యనాశ!

మ. హిమశైలేంద్రజపూజకై యువతు లెంతే నుత్సుకస్వాంతలై
రమణీయంబగు వస్త్రసంతతుల సాలంకారలై దివ్యకుం
కుమ పళ్లెంబుల నింపి హంసలగతిన్ గుంభీద్గతుల్ మీఱ వా
ద్యముల న్నీనిలయంబుఁ జేరఁగను భాగ్యం బబ్బె నాకియ్యెడన్.

మ. ధరణీదేవులు మేల్దుకూలములచేత న్వేల్లుచు న్వేదమం
త్రిరమన్ దామ్రఘటంబుల న్గరముల న్ధార్పట్టి నీరంబుల
న్వరుస న్దెచ్చుచు వేఘటంబులును నీపై సాభిషేకంబు భ
క్తిరమ న్సల్పఁగఁ జూచుభాగ్య మది గల్గె న్విశ్వమల్లేశ్వరా!

మ. శతసాహస్రమితంపు బిల్వదళ పూజాసేవనారీతి నా
మతి హర్షోదతిఁ గాంచి ధన్యతమతన్ మత్తేభయానోత్సవ
సితి నీక్షించితి నేత్రపర్వముగ సుశ్రీనిచ్చి పాలింపు భ
క్తతతి న్మేరుగిరీంద్రచాప! సతియుక్తా! విశ్వమల్లేశ్వరా!

శా. వ్యాకర్ణాన్వయదుగ్ధవార్ధి విధుఁడున్ బహ్వార్యవిద్యాపరీ
క్షాకీర్ణుఁడగు వేంకటేశ్వరుని సత్సాంగత్యమూలంబుగా
నీకాలంబునఁ బౌరులెల్లరు భవానీనాథ! నీయుత్సవా
నీకంబు న్గని. రట్టిధన్యులఁ గృప న్నేలు మల్లేశ్వరా!

ఓమ్

—♦ విశ్వమల్లేశ్వరాష్టకమ్ ♦—

(సన్నిధానము విశ్వనాథశాస్త్రిగారు.)

శ్లో. శ్రితామరమహీరుహ శ్శ్రితిశిరోఽధిగమ్య స్సురాఽ
సురావళిశిరోమణిద్యుతివిభూషితాఙ్ఘ్రిద్వయః
సుమాయితసుధానిధి ర్ధృతపృదాకుభూషావళి
స్తతోఽస్తు మమ సన్నిధిం మనసి విశ్వమల్లేశ్వరః.

శ్లో వసాన మజినం నవం హృతగజాసురాసువ్రజం
వృషాధిపతురంగమం వృతతుషారగోత్రాత్మజమ్
అనంగతనుభంగకృద్విపులలోలఫాలేక్షణం
భజే భుజగభూషణం మనసి విశ్వమల్లేశ్వరమ్.

శ్లో. ప్రదోషనటనోత్సవస్ఫుటవిలోలశోణప్రభా
జటామకుటవాటికాపటునటత్సురౌఘస్రజమ్

కటిస్థలపటాయితప్రథితపుండరీకాజినం
శివం మమ విచింతయే మనసి విశ్వమల్లేశ్వరమ్. ౩

శ్లో. రథీకృతసుసారథీకృతధరాంబుజాతోద్భవం
శరాయితశరాసనీకృతఃధూరుమేరుం, పరమ్
హయాయితమహాగమం త్రిపురదైత్యసంహారకం
హరం మమ విభావయే మనసి విశ్వమల్లేశ్వరమ్. ౪

శ్లో. జగత్త్రియలయోద్యతోద్ధతమహోగ్రహాలాహల
ప్రభక్షణవిలక్షణక్షణవిలోలగర్భానలమ్
మదోత్కటమహాసురోదరవిదారణోద్యద్రవమ్
భవం భవహరం భజే మనసి విశ్వమల్లేశ్వరమ్. ౫

శ్లో. ప్రశాన్తమసురాన్తకం ప్రలయకాలకాలాన్తకం
పరేతనిలయాలయం నరకపాలమాలాకులమ్
చితాభసితభాసితం వృతపిశాచయూథాధిపం,
భజే భవభయాపహం మనసి విశ్వమల్లేశ్వరమ్. ౬

శ్లో. జగత్త్రితయసంభవోదయలయాదిబీజై ర్నిజై
రజాదిసురకాంక్షితై రతిపవిత్రచిత్రైః పరైః
చరిత్రనిచయై స్తతై రతివిమోహయన్తం జగ
న్నమామి పరమాం గతిం మనసి విశ్వమల్లేశ్వరమ్. ౭

శ్లో. హృషీకధిషణాగిరా మపరిగమ్యమానద్యుతిం
భవస్థితిలయాదిభి ర్విరహితం విధూతైనసమ్
సమస్తసురనాయకం సకలసౌఖ్యసంధాయకం
భజే సుజనకల్పకం మనసి విశ్వమల్లేశ్వరమ్. ౮

—♦ భ్రాతలు ♦—

ఆంజనేయులు.—

మాతండ్రికి నలుగురు కొమరులు.

కం. అందాంజనేయు లగ్రజుఁడందెందో తిరిగి చదివి హితమగుకల లా
నందనుఁడు రంగమాహ్వయసుందరిఁ దొలిమేనమామసుతఁ బెండ్లాడెన్
తే. గీ. మఱియు నిరువదిరెండేండ్లతరుణముననె
పంచపక్షీయ కేరళపరమమహిమ
పాండితీమండిత స్తోత్రపాత్రుఁడగుచు
చెలఁగి యాతండు తాఁ గీర్తిశేషుఁడయ్యె. దే॥ న॥ మ॥ అ॥

ఆయన కాయమువిడుచునప్పటి కేఁడాదియో రెండేండ్లయో యీడున నే నుంటినఁట. కనుకఁ గలవిశేషము లన్నియుఁ దెలియవు. ఆసన్నమరణమున కష్టపడంబ హాహాకారము సేయుట యర్భకుఁడనైన నేను "అంజనేయులు, అంజనేయులు" అని యనువదించెడివాఁడనఁట. ఆయన కేరళశాస్త్రమే కాక జ్యోతిశ్శాస్త్రమునఁ గల జాతక ముహూర్త సిద్ధాంతభాగముల మూఁటిని జదివెననియుఁ దానును దచ్ఛాస్త్రియమునఁ బ్రవేశముగలవాఁడగుటచే నుభయులును గలిసి పంచాంగమును బ్రకటింప యోజించుచుండునంతలోనే యొడలు విడిచెననియు మాతండ్రి చెప్పుచుండెడివాఁడు. కావ్యము లెంతవఱకుఁ జదివెనో యేమో కాని యాయన స్వహస్తముతో వ్రాసికొనిన మేఘసందేశాదులు మద్బాల్యమున మాయింటఁ గనఁబడుచుండెడివి. విద్యావ్యాసంగముతో విదేశమందే తిఱుగుచుగా నీయన యుండుచుండుటయు మా తండ్రి బలాత్కారముగాఁ దోడ్కొనివచ్చి పదునొకండేండ్ల మేనమామకూఁతుఁ బాణిగ్రహణము చేయించెను. అందువలననే యాంజనేయులు కన్యజాతకచక్రమైనను సమీక్షించినవాఁడుకాఁడు. పరిణయమైన పదపడి మాతులగృహమున మనుగుడుపులు చేయుచు నర్ధాంగి జన్మపత్రిక యడిగితీసికొని జాతకము వ్రాయ సమకట్టుటయు వత్సరార్ధమునకే వచ్చు వైధవ్యము కనఁబడియెను. హస్తము సాగక యంతటితో నది కట్టిపెట్టెను. అదియే చింతతో నచిరకాలమున కా యత్తగారియింటనే వ్యాధిగ్రస్తుఁడయ్యెను. ఆఱుమాసములకే యసువులువిడిచెను. నకరకంటనే సకలము ముగిసెను. ఈకారణముననే యేను నకరకంటి కర్పింపఁబడిన ప్రథమసుతుని గుఱించి పరిదేవించుటలో

సీ. తనయ! నీపెదతండ్రి హనుమయ్య పిలిచెనా
నకరకంటి శ్మశాననికటమునకు

అని వ్రాసియుంటిని. ఆంజనేయులు హనుమయ్య యనికూడ నాయనకు వాడుక యుండెడిది.

తత్పత్ని—

ఈమె ప్రాక్తనపుణ్యవిశేషంబున బాలవిధవయై చాలకాలము జీవించినది. తల్లి పంపకయుఁ దన కిష్టము గాకయుఁ బుట్టింటనే పూర్తిగా వెళ్ళించినది. కాని యత్తింట నంత్యమువఱకు నంతయుఁ గలిపికొనిన వర్షసంవత్సరమైన నుండియెఱుఁగదు. అవచ్చినప్పుడైనను నల్లుండ్రవోలె నుండినది కాని కోడండ్రవలె భయభక్తులతోఁ బ్రవర్తింపను. పుట్టింటమాత్రము పాలపుఁబసుల దగ్గఱనుంచి పొనరించుచు మగరాయఁడువలె మనఁగలిగెను. చత్వారింశదబ్దపర్యంతము సకేశయయియే సంచరించెను. తలవెండ్రుకలు తీయించుటకుఁ దత్సహోదరులకుఁ దల్లికిఁ గూడ నిష్టమైనది కాదు. నాతల్లిదండ్రులును నాసహోదరులును వేసారులు చెప్పి వేసారిపోయిరి. పదియేడేండ్ల ప్రాయమునఁ బాతూరి యక్కంభట్ల ప్రేరణచే బాల్యలౌల్యముతో నీవిషయమై హెచ్చరించి యేను నిందటికిని విరోధినైతిని. అవిరోధము తోడనే యక్కబిడ్డ నస్మదర్ధాంగిఁజేయుట కిష్టములేక మాబావ మతి త్రిప్పి పరున కిప్పించిరి. అయినను నటుతరువాత నబ్దదశకమున కవిముక్తక్షేత్రమున కరుగఁదలఁచి యటనైనను నాకె శిరోజముల వదలింతమని యనుకొని హైదరాబాదునుండి గంగాస్నానము చేయించెదను గ్రక్కున బయలువెడలి రావలసినదని కోరవ్రాసితిని. కాశీయాత్ర ఘటించునను కౌతూహలముతోఁ గదల నెంచినది కాని హైదరాబాదువఱకు నయోమార్గవ్యయ మామెకుఁ గావలసివచ్చెను. అది యస్మద్భ్రాతల నడిగెను. వార లీరైరి. అంత నమ్మయు నన్నయు నాపెయు హైదరాబాదువఱకగు వ్యయము భరించి యందఱు నరుదెంచిరి. ఇరువురకనియే యేను సిద్ధము చేసికొన్న తద్ధనము చతుష్టయమునకు సరిపోక శ్రమపడితిని. వీరి మువ్వురిని వీలైనచోట విడియించి యవశిష్టాయోమార్గవ్యయమునకై యత్నించుచు నటు నిటు భ్రమించుచుండుటయు నతివ్యయప్రయాససాధ్యమగు నవిముక్తక్షేత్రయాత్ర పరిష్కృత మాపవలసినదని భ్రాత లుత్తరము వ్రాసిరి. అన్యదేశమం దాసమయమున నప్పుగూడఁ బుట్టక యట్లే యాచరింపవలసినవాఁడనైతిని. వదినెయు మేనత్తయు జాబువ్రాసినందులకు నా సహోదరులును దదాజ్ఞ నిర్వహించినందులకు నన్నును నెగ్గాడుచు నెట్లో యింటి కేతెంచిరి. తదవ్యవహితోత్తరదినములనే యస్మజ్జనని వ్యాధిగ్రస్తయై యాసన్నమరణ యగుటయు నన్న లంపిన యాలేఖ చూచుకొని యరుదెంచులోపలనే యామె యసువుల విడిచెను. నకరకంటిలోనే నా కావార్త తెలియనయ్యెను. అన్నదమ్ముల ముందఱను నాయమ కపరకర్మ మాచరించుచుండుటయుఁ బదియవనాఁటికి వదినెగారు వత్తువని వార్తనంపెను. యాత్రార్థమై హైదరాబాదువఱకు కరిగియు నేకృష్ణలోనో యాకేశముల వదలించుకొని రానిహేతువున సకేశవగు నీవిపుడు రావలదనియు వచ్చినచో నిప్పుడే నీతలవెండ్రుకలు తీయింతు మనియు నస్మద్భ్రాత లామెకుఁ జెప్పిపంపిరి. అంతటితోనే యామెను మాకును సంబంధము తీఱిపోయెను. తరువాత నెప్పుడో తల గొఱిగించుకొనినది. తనువు విడిచినది. అపరకర్మ మాచరించి యామె యనుభవించుచున్న నకరకంటిలోని మాపిత్ర్యమైన మాన్యము మే మధీనము చేసికొంటిమి.

రామలింగశాస్త్రి—

సీ. రామడుగన్వయసోముఁడౌ వెంకయ్య
 శాస్త్రికయ్యెను బ్రియచ్ఛాత్రుఁడెవఁడు
పఠియించి కావ్యముల్ పంచదశస్మార్త
 కర్మలం జేయింపఁగలిగెనెవఁడు
ఉభయభాషలలోననుండు పురాణముల్
 పలుమాఱు ప్రవచనల్ సలిపెనెవఁడు
నిత్యనైమిత్తిక నియమంబులం జాల
 ఆచరింపఁగఁ గల్గె ననయమెవఁడు
విమలచారిత్ర సుబ్బమం బెండ్లియాడి
తనుజయుగళము నొకకూఁతుఁ గనియెనెవఁడు
అతఁడు రెండవవాఁడయి యవనిఁబరఁగె
రామలింగాభిధుఁడు సదా రత సుపథుఁడు. దే॥ న॥ వ॥

ఈయన రామడుగు వెంకయ్యశాస్త్రులుగారిదగ్గఱనే నైషధాంతకావ్యములును వివాహోపనయనాది స్మార్తమంత్రములును జెప్పుకొనియెను. ఆయనకుఁ బ్రియశిష్యుఁడగుటయే కాక యాయన బంధుమిత్రులకును నాదెండ్లగ్రామవాసులకందఱకును దలలోని నాల్కయై తనరఁగలిగెను. వారందఱును నీయనను జుట్టమును గాఁ జూచుకొనిరి కాని సుహృత్తునుగాఁ జూచియుండఁగరు. శాస్త్రులుగారి తమ్ముఁడు సుబ్బయ్యగారు చేసిన సప్తాహ బ్రహ్మసత్ర రామయజ్ఞములు మూఁడును నీయన యాలోచనతోను నీయన పెత్తనముతోనే యైనవని. వేయేల? వారందఱుఁ జనువు కొనుసమయమున స్వగ్రామమునకుఁ జనినపుడును జదువు చాలించివచ్చినతరువాతను నీయన విరహమును భరింపలేక యెంతయు స్మరించుచుండెడివారు. ఈయన మంచితనమే యింతకును హేతువు. ఆయననే కాక యాయనసబంధులమగు నస్మదాదులను గూడ వారందఱు నాఁటినుండి నేఁటివఱకు బ్రదికియున్నవారు బంధుగులనుగాఁ జూచుచున్నవారు. ఈదేశమున నెంతయుం బాదుకొనియున్న వెలనాఁడు తెలగాణ్యము లోనగు శాఖాభేదముచే సాహసింపలేకపోయిరి కాని యాయన నల్లునిజేసికొనుటకుఁగూడ నపేక్ష లభిలషించిరి. చివర కాభాగ్యము సత్తెనపల్లితాలూకా మాదల గ్రామనివాసియైన మేళ్ళచెఱువు సాంబయ్య పడయఁగలిగెను.

అట్లాయన యాత్మజం బెండ్లాడి యామె కాఁపురమునకు వచ్చుటయుఁ జదువుఁ జాలించి స్వగృహమున నుండఁగడఁగెను. అత్యంతానోన్యానురాగములతో సతీపతులు సంచరించిరి. జననీజనకుల సంతోషపెట్టిరి. సంసారమును జనకుఁడే దిద్దు

మున్నను పౌరోహిత్యభాగమునం దాయనకును దఁడ్రిచాటున లీలమై సాఁగించు వ్యవసాయాదికమునఁ దనకన్నను దక్షుఁడైన తమ్మునకును దోడుపడుచు సత్పురుషుఁడను పేరు సంపాదించెను. సంవత్సరమునకు జనకుఁడు స్వర్గతుఁడగుటయు సంసారభారము నెత్తినిఁ బడెను. ఆభార మబద్ధవ్యయోనవయస్కుఁడగు ననుజునకును దనకును సమానముగ సాత్వికుఁడగు తాను స్వతంత్రించి సకలవిషయములను ముందంజ వేయు నాయనను గాదని యేమియుఁ జేయలేకపోయెను. చెప్పినపని చేయుచు వచ్చెను. ఖరసంవత్సరపుఁ గఱవుగూడ ఘటించుటచేఁ గుటుంబపోషణము కొంత భారమనిపించి తమ్ముఁ డుపేక్షించినఁ దానే మోయవలసివచ్చెను. గోరుచుట్టుపై రోకటిపోటువలెఁ దమ్ముని ధర్మపత్ని కాలధర్మము నొందుటయు నప్పుడే తటస్థింపఁ దద్భారము దించుకొన వీలులేకపోయెను. తదర్థమై తత్కృచ్ఛ్రములు పడఁజొచ్చెను. అర్థార్జనార్థ మన్యదేశములకు వెళ్లెను. పురాణప్రవచనలు నొనరించెను. ఎట్లయిన నేమి? తమ్ముఁడును దానును నబ్దపంచక మాసంసారభారము వహించిరి. అనుజుని పునర్వివాహ మబ్దచతుష్టయమున కైనయది. అందుల కాస్తియంతయుఁ దాకట్టుపెట్ట వలసివచ్చినప్పటికి నాయనగాని నేనుగాని యభ్యంతరము చెప్పక నిర్వహించితిమి. అవివాహమైనతరువాత నన్నదమ్ము లిరువురికి నంతస్సులలోఁ గొంతస్పర్థ యంకురించెను. క్రమక్రమాభివృద్ధియై కడకు విభక్తులఁగూడఁ గావించెను.

విభక్తుల మైతిమన్న మాటయే కాని విభజించుకొనిన విత్తాదికము విశేషించి లేదు. పిత్రార్జితమై యప్పటికి నిలిచియున్న పృథివి 11 ఎకరములు. అందు 4 ఎకరముల మాన్యమును నస్మన్నివాసగృహమును దాకట్టుపెట్టఁబడియున్నవి. అవివాహితుఁడనైన నాకందులోఁ బెండ్లిభాగముకూడఁ దీయవలె. అమ్మకుఁ గొంత భూమి యర్పింపవలె. కట్టినలోగిలి యంతయుం గాక వారిరువురు వందవందరూపాయలు పెండ్లిభాగముక్రింద నాకొసంగిరి. ఈరామలింగశాస్త్రి యింతిపై హెచ్చు నగలున్నవని మఱిముప్పదిరూపాయలిచ్చుటకు మధ్యవర్తులు తీర్మానించిరి. ఇనాము మాత్ర మందఱము పంచుకొంటిమి. వీరిరువురికిని విడిస్థలమే వచ్చినది. ఎవరి పుస్తకములు వారికే. అప్పటికే నాపుస్తకము లధికము. మధ్యస్థునకు మొదటికే లేవు. ఎవరి పర్యంకాదులు వారికి. తల్లి కేడెకరముల జిరాయితీభూమి అది యామె యొకరి పోష్యవర్గములో నుండినపుడు వారనుభవించుచుఁ దుద కెవరిదగ్గఱ మరణించునో వారికిఁ జెందునట్టి యేర్పాటు, నకరకంటి 4 ఎకరముల యినాము పెద్దయన్న భార్య జీవితాంత మనుభవింపఁ దరువాత నందఱికి. ఇవి మావిభాగములు. అప్పటికి రామలింగయ్య కపత్యద్వయము గలిగియున్నది. అవివాహితుఁడను నేను. అమ్మ పెద్దది. పెద్దతమ్ముని పెండ్లాము కాఁపురమునకు రాలేదు. వీరిరువురకును విడిస్థలము తప్ప వేశ్మములు లేవు. ఈయీకారణములనుబట్టి కట్టినలోగిలి నాభాగమున వచ్చినప్పటికి రామలింగయ్య యమ్మను నవివాహితుఁడనైన నన్నుఁ బోషించుచు నాయింటనే యుండవలసినవాఁడయ్యెను. ఒక్క పెద్దతమ్ముఁడే యొండెడ నుండెనుగాని యన్యమంతయు యథాపూర్వమే.

ఉ. ఆర్యులు తెల్పలేనియెడ నట్టిటు లాశ్రితు లల్లినారు, నే
డార్యులు తెల్పఁగాంచి కని రందలి తప్పులు, గాన ఛాందసా
చార్యతఁ దెల్పిరంచ నెడు వాదులు కొండొక యూహసేసి యి
ట్లర్యమతేజ మిందుఁ గృతమందురు తిర్పతివేంకటేశ్వరా! 82

చ. నలువ మొగంబులన్ శ్రుతులు నాఁడు ప్రకాశిలునంతలోనె త
ద్గళమును వ్రక్కలించుకొని తాఁ బ్రణవం బరుదెంచెఁ గాన మం
గళము ప్రధాన మద్దియని కాదె వచించెఁ బురాణవాణి! ఈ
తులువల కీవిలాసములు తోఁపవు తిర్పతివేంకటేశ్వరా! 83

చ. మఱియు నథాఖ్య మవ్యయము మానితమౌ ప్రణవంబుతోనె యు
క్కఱపడి తోఁచె వేదములకన్నను మున్నుగ నంగి నద్ది యే
మఱి దటు లేను సంగముల మండల మేలుదునంచుఁ దెల్పితా
ఎఱుకఘటించు నెవ్వరికి నేనియుఁ దిర్పతివేంకటేశ్వరా! 84

చ. నలువమొగంబునన్ శ్రుతులు నాఁ డుదయించినయట్లె తోఁచెమా
నులదెస సంగముల్ శ్రుతులు నూత్నపురాణకథేతిహాసముల్.
తలఁపఁగ వాని యాదలనె తా నథశబ్దము పొల్చెఁగాన నే
కలన ః కల్పితంబులనఁగానగుఁ దిర్పతివేంకటేశ్వరా! 85

ఉ. దేశికవర్యు లాశ్రితిగతిన్ వివరించెడుపట్ల నామనః
కోశము తత్స్వరూపమని కూర్చి పురాణములాదిగాఁగ నా
దేశములంచు దాసికివి దెల్పిరి యాత్మయటంచు నింక నా
వేశము వీడరెట్లు మనవేత్తలు తిర్పతివేంకటేశ్వరా! 86

ఉ. ఆస్తికులే పురాణములయం దొకకొన్నిటి తామసంబులం
చస్తమతుల్ వచింతు. రదియానెటు? లన్నియు శ్రౌతదేవతో
పాస్తివశాత్మతం దదనువాద్యధికారభిదన్ ఘటించు. త
త్ప్రస్తుత మెంచఁబోరు నెఱవాదులు తిర్పతివేంకటేశ్వరా! 87

చ. క్రమముగ నీశకల్పకము కల్మి నుతించెను శాస్త్ర మిట్లు. ధ
ర్మము దృఢబద్ధమూలమటు ప్రాఁబలుకుంగుమి స్కంధ. మాపురా
ణము లితిహాసముల్ స్మృతిగణమ్ములు కొమ్మలు. మేలిపూలుయా
గములు. ఫలమ్ము మోక్షమని కానరొ తిర్పతివేంకటేశ్వరా! 88

చ. కృతయుగమందునన్ నలుఁడు కేవలుఁడే? రఘురాముఁ డల్పుఁడే?
వితతయశుండు ధర్మజుఁడు వీఱిడియే? తగ సాంగవేదసం
తతపరిశీలనంబునఁ బ్రధానతఁగాంచరె? ఆర్యులో యనా
ర్యతగనిరో? విరుద్ధమతులైరొకొ తిర్పతివేంకటేశ్వరా! 89

చ. ఇది యుపలక్షణంబనుచు నింతయెఱింగి సుఖింత్రో మావదా
వదు. లోకరిద్దఱేమొయని వ్రాలఁగఁజూతురో? కోటికోటు లి
ప్పుడమున వన్నెకెక్కి ప్రతిపత్తివహించిరి. సాంగవేదసం
పద కలకాల మీకరణి వర్తిలుఁ దిర్పతివేంకటేశ్వరా! 90

ఉ. ఆ మొదలింటిసర్జనమె యాదిగ నేఁటికి వేదకల్పకం
బోమెదు మేటిపుష్పఫలయోగము పెంపువహింప నిప్పుడీ
బూమెలవార లేమిగతిఁబోయెదరో కద దానివీడి! సు
శ్రీమహితత్వ మెట్టులిఁకఁ జెల్లును దిర్పతివేంకటేశ్వరా! 91

ఉ. పూజితుఁ డిజ్జగంబునకుఁ బ్రోపుదలంచి విరించిఁగూర్చి తా
ఓజ మహావ్రతాచరణ మొప్పఁ బఠించె శ్రుతుల్ ధృతిన్ భర
ద్వాజమహర్షి. వేయునగువర్షము లాయు వతం డొసంగ వి
భ్రాజితుఁడయ్యు దీని దరిఁబట్టఁడు తిర్పతివేంకటేశ్వరా! 92

ఉ. ఆదట నమ్మహాత్ముఁగని యబ్జభవుం డిదె రమ్మటంచు సం
మోదముమీఱ సత్యపురిముంగిటి కల్పకమైచెలంగు న
వ్వేదగిరిత్రయంబు గనుపింపఁగఁజేసి యొసంగె భిక్ష న
త్యాదృతి మూఁడుదోయిళుల నాత్రయిఁ దిర్పతివేంకటేశ్వరా! 93

ఉ. ఋక్కు సహస్రశాఖ నుతికెక్కెను పోపశతంబుశాఖలన్
దక్కె యజుస్సమాఖ్యశ్రుతి తానటు. సామ మనంతశాఖలన్
పిక్కటిలెన్. జగత్త్రయము పెంపువహించె. తరించి రెల్లవా
రక్కరుణాంబురాశి మునియాదృతిఁ దిర్పతివేంకటేశ్వరా! 94

ఉ. ఎన్నియుగంబులేగెనిటు? లేగఁగనుండె నిఁకెన్ని? ఎన్నఁడున్
కన్నదికాదె? సుస్థిరతఁ గాంచు. ప్రకాశముఁగాంచు. ఒందు నే
మన్నను. సర్వలోకనివహాంతరుపస్థితనిత్యయోగసం
పన్నము. దీనిసాటికెది పాటిలుఁ దిర్పతివేంకటేశ్వరా! 95

ఉ. సోమకుఁ డట్లు దొంగిలినచో శ్రుతులన్నవి పుస్తకంబులో
భామలొ వస్తుభేదములొ పాల్పడకున్నది మాకటందు రీ
సోమరు. లిట్టియూహలకుఁ జోటిదియో? అది కాలలబ్ధని
ద్రాఘుషితంబుగాఁ దెలివిరాదొకొ తిర్పతివేంకటేశ్వరా! 96

ఉ. శుక్రముఁబీల్చె ము న్నల విశుక్రుఁ డవక్రపరాక్రమంబునన్
శక్రముఖామరు ల్గలఁగ సారవిహీనత ముజ్జగంబులున్
విక్రమమేది జాలివడ. వేలకొలందిగ నిట్టి చిత్రముల్.
సక్రమతం దగం దెలియఁజాలరు తిర్పతివేంకటేశ్వరా! 97

ఉ. ఏటికి వట్టిమాట? లిట కెప్పుడువచ్చిరి యార్యు? లీశ్రుతుల్
నాటినదెప్పు? నవ్యరచనావిభవస్థితి యెద్ది? కానరా
నాఁటికి నేఁటికిన్ నిగమనారద మెల్లెడ ధర్మధారలన్
మోటులిగుర్పఁగాఁ గురియుముచ్చటఁ దిర్పతివేంకటేశ్వరా! 98

ఉ. అధ్యయనంబె ముత్తరులయందున నియ్యది ధాతయేని తా
నధ్యయనంబొనర్చినన నాదటఁ గర్తలులేరు దీనికిన్
సాధ్యవసాయవృత్తు లుదయంబగునెన్నియు నొడ్ల కిమ్మహా
నిధ్యవసానముం దెలియనేరవు తిర్పతివేంకటేశ్వరా! . 99

చం. అహామనవచ్చు నొడ్లయెడ నాదర మూడ్వఁగవచ్చు వృత్తమున్
గహనమొనర్పవచ్చు నగుఁ గాదనవచ్చుఁ బదార్థకాంక్షులన్
విహారణమందవచ్చుఁ దగువేసము వేయఁగవచ్చుఁబో. గుణ
గ్రహణము సేయువాఁడె మొనగాఁడనఁ దిర్పతివేంకటేశ్వరా! 100

—•విద్యార్థులు•—

ఉ. కూటికిలేకయో పనులగోడుననో తమయింటివారిదే
పోటుననో యెటో చదువ బుద్ధిజనించినవారపోలె మేల్
మాటల నయ్యవారికడ మంచిగఁజేరి చరింతురు. విద్దెలన్
పాటున కెంతయుం దగ రపాత్రులు తిర్పతివేంకటేశ్వరా! 101

చం. చదువుఁడనంగ నొడ్లకడఁ జాటున మాటునఁ జేరి ముచ్చటల్
పదములుఁ బిట్టనాటకపుఁ బాటలుఁ బాడుచు నెప్డా యిచ్చమై

గుదికొని పాఠముం జెదిరెము గొణ్గి యెటో గుటివెట్టిపోదు. రి
మదయుతులా పఠించు మతిమంతులు తిర్పతివేంకటేశ్వరా! 102

ఉ. పాఱుల కెప్పు డెన్మిదవ వత్సర మొప్పెడు నంతలో ముదం
బారఁగ నోపనాయనికమా విధిఁ దీర్చి శ్రుతుల్పఠింపఁగన్
వారల సద్గుణాఢ్య గురువర్యుని సన్నిధిఁ జేర్ప విద్దె ల
వ్వారిగ సంగ్రహింతురి ధృతివాటిలుఁ దిర్పతివేంకటేశ్వరా! 103

ఉ. సార్థకమా క్రియం గొని ప్రయాసపడందగు మంచివేళఁ గ్రి
డార్థమె యుట్టిపోఁ బరిణయంబొనరించినమీఁద వార లే
అర్థముగోరియో చదువ నట్టిటు పాతరలాడనేమి వి
ద్యార్థులె వార లింక? విషయార్థులు తిర్పతివేంకటేశ్వరా! 104

ఉ. ఒక్కఁడు బారముల్ చదివి యూహజనించెడివేళఁ బోయి వే
ఱొక్కనిఁ జేరి ప్రల్లదము లొప్ప మఱొక్కని నాదరించి యే
చిక్కినయేని విద్దె ముడి చిక్కటి మూరెఁడుసాగనీక పై
నుక్కటిదోస మొజ్జపయి నుంతురు తిర్పతివేంకటేశ్వరా! 105

ఉ. కాశికిఁబోయితిం జదువఁగా నట ధన్యుఁడ నైతిఁగాక యీ
దేశమువారు సెప్పినను దెల్విజనించునె వ్యాసభట్టు నా
దేశికుఁ డెల్లశాస్త్రముల దిట్టతనంబువహించినాఁడనం
చూశలుగొల్పఁ బల్కు నొకవ్యర్థుఁడు తిర్పతివేంకటేశ్వరా! 106

చం. అపరుఁడు గొప్పవాఁడు గురుఁడన్నను స్వీయప్రతిష్ఠ వాయునం
చెపుడెటొ యెవ్వరో తెలిపి రెవ్వియొ రెండుపదాలు మీఁదటన్
విపులపరిశ్రమంబున వివేకముగొంటిని రెంట మూట నా
కిపు డెనరా రొకొం డ్లను ద్విహీనుఁడు తిర్పతివేంకటేశ్వరా! 107

చం. ఇది నిజవిద్య యేము దరియింతుము జ్ఞానము గల్గ నంచుఁ దా
మొదలిడువానిఁ గన్గొనమ ముఖ్యకళల్ పఠియింప దుడ్డులే
మి దెవ్వులుదోఁచుటన్ వయసుమించుట నెట్లెటొ జీవనార్థియై
మది సరిగాని యిప్పనికి మార్చును దిర్పతివేంకటేశ్వరా! 108

ఉ. ఇందుల కేని పాల్పడఁ డొంకించుక పాటకుఁగూర్చు కంఠము
వ్వుం దగునొజ్జ చొప్పడిన నారులజెంటఁ బఠించుటొప్పినన్.

చం. కలుషమువంకఁబోక చెలికారము సజ్జనులందుఁ గూర్చి పె
ద్దల భజియించి ధర్మస్మృతిఁ దారొకనఁజాలి దురాశమాని సౌ
ఖ్య లహరి నోలలాడుచుఁ బరాత్ముని భావమునందు నిల్పి వ
ర్తిలఁ గలి యేమిసేయు? కలి దేవుఁడ! తిర్పతివేంకటేశ్వరా! 41

ఉ. కలిపయిమోపనేల? బలుకల్మషముల్ పొనరింపనేల? స్వీ
య లలితశక్తిఁ బాసి నరకాంబుధిఁ గూలఁగనేల, నెమ్మదిన్
పొలుపుగ నీశు నిల్పి సరిపోలినకర్జములన్ మెలంగ న
క్కలన నెదిర్చనేని కలి కాలఁడె తిర్పతివేంకటేశ్వరా! 42

—* బ్రాహ్మణులు *—

చం. కలియన శాపమో శనియొ కాలమొ కర్మమొ గాలిసోఁకుడో
కలుషమొ నిద్రయో కలయొ కామరహస్యమొ గ్రామశక్తియో
తెలియఁగరా. దపస్మృతికిఁ దెచ్చె ద్విజావళిఁ దొ త్తఁ బట్టి బె
బ్బులిగుమి యాలమందగతి బోరనఁ దిర్పతివేంకటేశ్వరా! 43

. కనుగవ మూసినంతటనె కల్గు సమాధి. జపంబా పూసలన్
వెనుకకుఁ ద్రోచినంతటనె వెక్కసమాఁగద! కర్మమన్ననో
ధనమును గూడఁబెట్టుటకు దారియచు. మ్మొకఁడేని తాఁ దరిం
ప నెదఁ దలంపఁ. డౌర కలిభానము తిర్పతివేంకటేశ్వరా! 44

ఉ. అలయజనాదిసత్క్రియలయం దపరాధశతంబు మోపి ద
ప్పుల నిడినారు. దుక్కి కెనుపోతులెకావలె. బ్రెందు లమ్మఁగన్
వలె. విటు లంజెఁ గూర్పవలె. వడ్డికి బేరములాడఁగావలెన్.
వెలసిరి నేఁటి కీసరఁశివిప్రులు తిర్పతివేంకటేశ్వరా! 45

చం. సురఁగొనితాగి చొక్కి యిదెచూ పరమౌషధమంద్రు. లిమ్మనే
ట్టిరవుగ శుద్ధగంగ యిది యేపటఁజేయును దాపమండ్రు. స
త్వరముగ భంగుఁబీల్చి యదె బ్రహ్మపదంబు నొసంగునండ్రు. వై
ర్వరు మదిఁ బాతకంబనినఁ బాఉలు తిర్పతివేంకటేశ్వరా! 46

చం. చదువన హూణవిద్యయని చాటుచు నయ్యెడ మేలుకోవలెన్.
చదువరులైన మాలలె పసందుగ వీరికిఁ దోడుగావలెన్.
చదివినయంతఁ దన్మతమె జానగుఁబో యనుచుం బెనంగుచున్
బ్రదుకవలెన్ శ్వవృత్తి నిదె బ్రాహ్మ్యము? తిర్పతివేంకటేశ్వరా!

చం. ఉపనయనంబునన్ విధుల నుంతురు జందెము జుట్టు. ప్రాణ మి
య్యుపనయనంబుఁగూర్చునెడ నూరకె యయ్యది ద్రెంతు. రట్టులే
శపథ మొనర్తు ర ప్పుభయసంధ్యలఁ బేర్కొన వేదమాతృకన్
శ్వపచులఁ గూడి యుప్పు డెడఁబాపఁగఁ దిర్పతి వేంకటేశ్వరా !

చం. అశనముపై నపోశన మహా ! పెడ కీఁగలఁదోలఁ జీమ లీ
దిశ గుమిగూడకుండఁగ నిదే పరిషేచనమన్న గొంతు బె
ట్ట శమనమందఁజేయుట కటన్ జలపాన మటందు. రిట్టి బా
లిశులకుఁ బ్రాణవిద్యయనలే మిది తిర్పతి వేంకటేశ్వరా ! 49

ఉ. ఇంటికిఁ బెద్దయైన యొకయెద్దును బట్టినయప్డె సత్రికిన్
బాటుతనంబువచ్చునటు బాపలఁ బట్టెఁ గలిగ్రహంబు. మున్
గంటిమొనర్చి జ్ఞానముకుఁ గర్మమువోఁ బెడకేడ్చె. ఇంక నే
వెంటఁజరింప, రెక్కలల వేఁగరు తిర్పతి వేంకటేశ్వరా ! 50

ఉ. రావఁట బ్రాహ్మణుండు. మును రావులు వెల్మలటంచు వాడుట
రావన నెందులం బనికిరావనుటో విన వెంతచెప్పినన్
రావిఁకఁ ద్రోవకం చనుటొ రాజగునన్నఁ గొలంబు వృత్తము
పోవుటెకాక యొండనఁగఁబోలునె తిర్పతి వేంకటేశ్వరా ! 51

ఉ. దాసపదంబు శూద్రులకుఁ దావలమం చభియుక్తు లందు. రీ
దాసులు నేఁడు బ్రాహ్మణులె. తప్పఁగఁదోఁపదు. మున్ను దేవతా
దాసుఁడొకొండుగల్గినను దత్పరతం జనె. నేఁటికల్పనల్
కాసులుగూడఁ బెట్టుటకుఁ గాఁదగెఁ దిర్పతి వేంకటేశ్వరా ! 52

చ. పసుపగుపేక వేయునెడఁ బందెము లేక రుచింపదందు. రి
ప్పుని తగదన్న మున్ను నరపాలకు లెందఱో యాడిరందురు. వా
రుచు జెడిరన్న మా కటుల రోసము మోసము లేదటందురు. తి
క్కన రిటు లెంతచెప్పినను గూళలు తిర్పతి వేంకటేశ్వరా ! 53

ఉ. మ్రుక్కిడు లెట్టులాడిన నమోయనుకాలమువచ్చె. కొందఱీ
చక్కనయుండి పోయిరఁట సంయమినిం గన. పిండదానముల్
ప్రాక్కృతముల్ కనంబడక పాడ్వడెనంట. పసుల్ మతాంతరుల్
చక్కఁగ నీసుఁజేరిరఁట. చాలదె తిర్పతి వేంకటేశ్వరా ! 54

శ్లో. పితృదుఃఖంతు షణ్మాసం. మాతృదుఃఖంతు తద్ద్వయం.
భార్యాదుఃఖం పునర్భార్యా పుత్రదుఃఖం నిరంతరమ్.

అను నభియుక్తోక్తి యన్వర్థమైనయది. బహుకాలము పరులమొగముఁ జూడక లేకయుఁ బరగ్రామమునకుఁ బోఁజాలకయుఁ బడియుంటిని. నాకే కాక నా సుహృద్బంధువులకును గొంతవఱ కీదుఃఖ మనుభవింపవలసివచ్చినది. చూడుఁడు.

...అయ్యో! లోకమే శూన్యమైనట్లు తోఁపించెడు గర్భశోకములో మునింగి పోతిరి కదా! విన్నవారల మనస్సులే చెదరిపోయినవి...కాని మీ రదేపనిగాఁ జింతించిన లాభ మేమియు లేదు ఆసంగతి మీకుఁ దెలియనిది కాదు ... అదువాండ్రకు ధైర్యము చెప్పవలసియుండును... శిష్టా హనుమచ్ఛాస్త్రి, గుంటూరు

... నిన్నరాత్రి నాచెవికిఁ గఠోర...వార్త సోఁకినది. సోఁకినప్పటినుండియు నావిచారమున కంతము లేదు ... సురూపియుఁ జతురుఁడు నగు మీకుమారుఁడు... తలిదండ్రుల ... దుఃఖపారావారమున ముంచుటకొఱకు మాదృశులఁగూడ ... ముంచి నాఁడు ... ఆపిల్లవానిని దలఁచుకొనినప్పుడెల్ల దుఃఖము కలుగుచున్నది ... వాని యుపనయనమునకు వచ్చి కన్నులార నామహోత్సవమును దిలకించు కుతూహలము ... నెఱవేఱకపోయె .. ఈనడుమఁగలిగిన ధనప్రాణనష్టు లౌకవిషయములోనికిఁ దీసికొనకుండ నుండినను లెక్క చేయవలసిన కష్టము తమకుఁ గలిగినందులకు మిక్కిలి చింతిల్లుచున్నాము .. ఈదుఃఖవార్తను మాయమ్మగారికి గురవయ్యగారికిఁ దెలియఁ బఱచితి ... ఆపిల్లవానిని గనినవార లందఱు మిక్కిలి వ్యసనపడిరి? ఎవరు వ్యసనపడినను నేమిలాభము? అందువలన ... తమరు జింతపడకుండుట కెక్కువగాఁ బ్రార్థించుచున్నాను. చివుకుల అప్పయ్యశాస్త్రి, సికింద్రాబాదు.

... పురుషోత్తముగారు...మీకుఁగల్గిన...విపత్తును ..మీప్రస్తుత దుస్థితియుఁ దెల్పిరి. కడు విచారించుచున్నాను. ఇట్టిపట్ల జ్ఞానదీపము తప్ప నీయజ్ఞానాంధకార వారకము వేఱుకాదు ... ఏవేని ... వ్రాసి మీశోక మాఁగుదమన్నను బుత్రశోక విషయమున నెక్కుఁడగిన యుపశమవాక్యములే లేవు.

చం. కొడుకులుగల్గుదాఁక నొకకొన్నిదినమ్ములు చింత. నందనుల్
వొడమిన నాయువుర్ బలము బుద్ధియు విద్యయుఁ జాలఁగల్గఁగా
ఉడుగనిచింత. కల్గి తను నోలి భజింపనిచింత. తండ్రి కె
ప్పుడుఁ గడుఁ జింతసేయుదురు పుత్రులు. శత్రులుగాక మిత్రులే!

ఇత్యాదు లనుభవజ్ఞులు వ్రాసినవిషయములు మీ రెఱుంగనివికావు. కావున మీకుఁగల విజ్ఞానమెల్ల నుపకరింపఁదగిన సమయ మిదియే ...

చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి, కడియము.

... భవత్పుత్రవియోగవార్తను వినవలసివచ్చినందు కెంతయుఁ జింతిల్లెద. తాము సత్కవులు ... కాన నామనస్సున కింతచింతగల్గె దైవంబు మీచింతాసాగరంబు తరింపఁజేయుటకుఁ దత్తరపాటుఁ జెందుఁగాక ...

తాండ్ర నృసింహశాస్త్రి, దుగ్గిరాల

... మీకుమారుఁడు పరలోకగతుఁడయినాఁడని చాల విచారము కలిగినది... కొమారుని చెయిదములు ... నా కాశ్చర్యము కల్గించెను .. అటువంటి కొమారుని బోఁగొట్టుకొని మీరు దుఃఖసముద్రములో మునుఁగుట విదితమే కాని యందువల్ల... ప్రయోజనములేదు ... దైవ మనివార్యము. దుష్కాలమున కేమి సేయవచ్చును ... దుఃఖమును వదలివేసి ... పత్రికయే పుత్రికగా నెంచుకొని... వృద్ధికిఁదీసికొనివచ్చి నాబోటివాండ్ర నానందింపఁజేయఁగలందులకుఁ గాను బ్రార్థించుచున్నాను ....

కొప్పరాజు గురుచంద్రశేఖరరావు, కొసూరు.

... మీకుఁ గలిగిన పుత్రరత్నవియుక్తికి మీతోడ సమదుఃఖభాజనుఁడనైతిని. మాలదైవము మన కర్మముపై బరువుపెట్టి యిట్టి యోర్వలేమిం జూపుచుండును. ప్రాజ్ఞులైన మీకుఁ బ్రత్యేకించి వ్రాయునది లేదు. లోకములో మఱి యెట్టి బరువైనను బంధుమిత్రులు పంచుకొన్నచోఁ దఱుఁగునుగాని దుఃఖభర మెందఱు పంచుకొన్నను నందఱికిని నిండై యెవరికిని దఱుఁగదు. ఇదియే యిందు విశేషము. మీవిలాపముఁ జదువఁగా మాగుండెలు చెక్కలగుచున్నవి. దుఃఖమును మ్రింగుటయే కుందు. ఏమియు వ్రాయఁజాలక విరమించుచున్నాఁడను ...

కస్తూరి శివశంకరకవి, విశ్వాసరాయపురము

... యోగ్యతకల్గిన పుత్రుఁడు గతించినందువలనఁ దమకుఁ గల్గిన వ్యసనమునకు మితియుండదు...మాకే మహావ్యసనము కల్గినపుడు తా మెట్లు భరించియుంటిరో ...

శ్లో. అపుత్రతా మహద్దుఃఖం మహద్దుఃఖం కుపుత్రతా
ద్వాభ్యామపి మహద్దుఃఖం సత్పుత్రమరణం సుత !

అని మార్కండేయులతోఁ దల్లిదండ్రులు చెప్పినట్లు సత్పుత్రమరణమువల్లఁ గల్గు దుఃఖమునకు మితియుండదు కాని...సుఖదుఃఖములు ప్రకృతికి స్వభావసిద్ధములని ... జ్ఞాపకముచేయుచున్నాను...లోఁగడ ..వాని జాతకమునుగూర్చి మనము మాటలాడుటలో నిట్టిభయ మున్నట్లు తాము చెప్పినపు డాభయము నొందఁ బని లేదని యనియుంటి...అన్యథా జరిగినందుకుఁ జాల విచారము. ఇందువిషయమై సర్వజ్ఞులకు విస్తరించి వ్రాయ శక్తుఁడను గాను. దీని మఱవవలెనని నాప్రార్థన ...

బండ్లమూడి రామచంద్రశాస్త్రి, చీరాల

... మీ కుమారుఁ డాకస్మికముగాఁ బరలోకగతుఁడైనట్లు తెలిసి మే మందఱముఁ బరితపించినాము...పరితపించిన లాభములేదు ..శివ మస్తు,

మల్లాది రామకృష్ణశాస్త్రి సోమయాజి, బెజవాడ

వరుసగా నిట్లెందఱెందఱో దుఃఖోపశమనలేఖలు దూరదూరములనుండి వ్రాయఁగడంగిరి తిరుపతి వెంకటకవులవంటి పరమమిత్రులు సమక్షమునకుఁగూడ వచ్చి జ్ఞాన ముపదేశించిరి. కడ కాదుఃఖము జ్ఞానము పోఁగొట్టకున్నను గ్రమక్రమముగాఁ గాలము కొంత తగ్గించినది. కాని నలి సం॥ మరణించిన నందను పేర

పెద్దగారి సం॥ చేయ మొదలుపెట్టిన నాగరఖండము కృతియిచ్చుటకుఁ గోరిక కలిగెను. తుదకు దుఃఖ మీతీరుగా మాఱినది అట్లు మాఱుటయు

ఉ. శ్రీరమ్యంబగు మాతృగర్భమును దా సేవించుటే యాదిగా
రారమ్మంచు బుధాళిచేత బహువారమ్ముల్ సమాహూతుఁడై
ధీరస్వాంతితఁ దల్లిదండ్రుల కెదో తీర్చెప్పి సేనానిగా
స్వారాజ్యంబును జేరఁగంజనిన సుబ్రహ్మణ్యు నెంతున్ మదిన్.

ఉ. ఒజ్జ మహాదృతిం గఱపు నుత్తమవిద్య బుధాళిచెంగటన్
లజ్జ దొఱంగి చూపుచును లాలితుఁడైన కుమారుఁ డెప్పుడున్
గజ్జెలు మువ్వ లందియలు కాళ్ళుల ఘల్ఘలు ఘల్లనంగ నా
పజ్జ వసించి యీకృతిని భద్రముగం బరిపూర్తిచేయుతన్.

ఉ. ఏమిది యారయంచుఁ దన హెచ్చగుమేధకు విజ్ఞులో నన
తామరు లబ్బురంబుపడునట్లుచరించెడి గుజ్జురూపు దా
ఈ మహనీయమౌ కృతి కొకింతయు విఘ్నముగల్గకుండఁగా
నోమి సమాప్తముం జలిపి, యుర్విని వ్యాప్తముఁ జేయుఁగావుతన్.

అని కృత్యాదిపద్యములు కొన్ని వ్రాసి శిష్టా హనుమచ్ఛాస్త్రిగారి చేతి కిచ్చితిని. ఇంకను బుత్రదుఃఖ మితని కంకలేదని యెఱిఁగి యాయన యేమేమిరా చెప్పి మోహబంధమును మూడువాళ్ళు త్రెంపివేసి మరణించిన సుతునకుఁ గృతి యిచ్చుటనుండి మరలించెను. ఇట్టివిధమునఁగూడ వీని నెదలో స్మరింపకున్నను గాలక్రమమునఁ దత్స్మారకచిహ్నములు నశించినను —

శ్రీ వేదమూర్తులైన జానపాటి పట్టాభిరామశాస్త్రి నాయనగారికి,...అనేక నమస్కారములుచేసి వ్రాయునది యేమనగా, ఇక్కడ నేను జదువుకొనుచున్నాను. నీవు దిగులు పడవద్దు, తొందరగా రావలసినది ... చిత్తగింపవలెను, 8-12-1916,

జానపాటి సుబ్రహ్మణ్యము.

అనుచు వాఁడాయీడుననే తనచేతిమీఁదుగా వ్రాసిన యుత్తరముమాత్ర మప్పుడప్పుడు కనఁబడి స్మరణకుఁ దెచ్చుచుండును. వీని తరువాతఁ జాన యేడుగురు బిడ్డలఁ గన్నను నేడుపులతోనే సరిపోయినది కాని సుతుఁడని చెప్పికొనఁదగినసూత్క్ష తరాయుష్కుఁడైనను జూచుకొన నోఁచుకొనను.

—♦ ద్వితీయసుతుఁడు ♦—

తొమ్మిది సం॥ లకు వీనిని జూచుకొంటిని. వీఁడును వెతపెట్టవచ్చినవాఁడే కాని వేఱుకాఁడు.కనిష్ఠపత్నికి మునుమున్నుగలిగినవాఁ డీద్వితీయసుతుఁడు. జఠరమునఁ బడ చతుర్మాసములకే జననిని జ్వరగ్రస్తఁ గావించెను. దాని కెట్టో తట్టుకొని

యుంటి యెనిమిదిమాసములు వెళ్ళించినది. ఎనిమిదినెలలు వెళ్ళియు వెళ్ళకముందే యేను పురుడుపోయుట కక్కఱబిడ్డనో యన్యలనో తోఁడ్కొనివత్తమని యరిగి యైదాఱుదినము లాలసించితిని. ఇంతలోపలనే యిల్లాలికిఁ బ్రసవచిహ్నములు ప్రారంభమై మలమూత్రముల నిలిపివేసినవి. ఒకటిరెండుదినము లీ యొకటిరెండ్ల సాఫు చేయుటకుఁ జేతనైనచికిత్సలు చేయఁబడినవి. ఒక్కింతయు నుపశమింపదు. బాధ దుర్భరమైనది. బంధుమిత్రులు పరివేష్టించిరి. బాగుగా నాలోచించిరి. ఆస్పత్రి కరుగుటతప్ప నన్యాచరణీయములేదని యనుకొనిరి. బందుగులున్న నరసరావుపేట యాస్పత్రికిఁ బయనముచేసిరి. కాని యాసన్నప్రసవయు నంతకును మించిన యధిక బాధ ననుభవించునదియు నైన యబల నిరువదినాలుగుమైళ్ళ దూరమందున్న నరసారావుపేటకుఁ జేరుచు టెట్లు? అందుల కన్యయానములకంటె మోటారుకారే యిప్పట్ల ముఖ్యమైయున్నది.

అది యదృష్టవశమున నస్మద్గ్రామముననే యప్పట్ల నలరారుచున్నది. అస్మదగ్రసుతునంత్యవేళ నస్మదంతికమున వైదురూపాయల గుమాస్తాగానున్న కానపాటి పురుషోత్తమే ద్వితీయసుతు ప్రసూతివేళ మోటారులకు ముఖ్యనాయకుఁడై యున్నవాఁడు. అబ్ధనవకమున కట్టి యైశ్వర్య మలవడినది. అందఱు నరిగి యాపురుషోత్తము నర్థించిరి. బస్సు నతఁడు పంపించెను. రెండును గుండె కెగఁదట్టి గోడుగుడుచు నాయాడుదానిని బస్సుపైఁ బరుండఁబెట్టికొని బంధుమిత్రులు పలువురు నడిరేయి నరసారావుపేట కరుదెంచిరి. భాగినేయు నింటిముందఱ బస్సు నిలిపిరి. మేనమామ యదృష్టమునుగూర్చి మిడుకుచు మేనయల్లుఁడు లేచివచ్చెను. ప్రక్కయింటఁ బరుండియున్న ప్రైవేటుడాక్టరు గోపాలకృష్ణమూర్తిని లేపెను. ఆయన యాత్మజలును నస్మదర్ధాంగియు సవయస్కలు. సావాసకత్తియలు. ఆ కారణముచే నా డాక్టరత్యంత ప్రేమఁజూపుచు నయ్యబల నాస్పత్రికిఁ బంపక యస్మద్భాగినేయు నింటనే ప్రవేశపెట్టి వడివడి వలయు పరికరము లన్నియుం దెప్పించి యాస్పత్రి మంత్రసానిచేతనే యావచ్చికిత్సలుం జేయించి యయ్యాపద తొలంగఁద్రోసెను. మఱియొక గంటయే గడచియుండిన మగువ మనచేతికి వచ్చెడిది కాదు. అర్ధరాత్రి యామోటారుపైఁ దీసికొనివచ్చుటచే నర్ధాంగి యసువులు నిలువఁగలిగినవి. పదుమూడు రూపాయల పావలా తీసికొన్నను బాప యాపురుషోత్త మాపద కక్కఱువచ్చెను. అట్లుపగతబాధయై యస్మదర్ధాంగి యామఱునాఁడు సుఖప్రసవమున సుతుం గనఁగలిగెను. ఇన్నియు నైనతరువాత నేను గుంటూరునుండి యేగుదెంచితిని. ఐనది యైనను నంత్యమునఁ బుత్రోదయమగుటకుఁ బొంగిపోయితిని. గర్భవతి యైనదాది కష్టములపాలయిన బాలెంతకుఁ బాలుపడమి నాయమ్మను నీయమ్మను ననునయించి యర్భకునకుఁ బోయించితిని. పదిదినములు వెళ్లినవి. మరలఁ బురుషసంతానము చిరకాలమునకుఁ జేకూరుటచేఁ బుత్రోత్సవము నొనరింపుమని మిత్రులు ప్రోత్సాహపెట్టిరి. బారసాల చేసికొంటిని. తనయునకుఁ దండ్రిపేరు లక్ష్మీనారాయణయని పెట్టికొంటిని. అన్నదాన మాచరించితిని. బందుగులకును మిత్రులకును బట్టణోచితములగు భక్ష్యభోజ్యములతో విందు చేయించితిని. కావలసిన వన్నియుఁ గావించితిని. పుత్రోత్సవము పూర్తియైనది.

సహాయులు

౧ మెదక్ శివజీ రావు దేశముఖుగారు, నల్లపల్లి.
౨ బీరకాయల హనుమంతరావు దేశపాండ్యాగారు, రాయగిరి
౩ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౪ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణము, దుగ్గిరాల
౫ శేల్గారి రామన్న గుప్తగారు, సదాశివునిపేట
౬ ఘంటంభట్లగారి వెంకటభుజంగముగారు — ముసలాపురము
౭ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యులు అయ్యవార్లంగారు. కాకాపురము
౮ రాయచూరి బండేరావుగారు, అయినాపురము.
౯ పేర్మలపల్లి కృష్ణారెడ్డిగారు, కేశవాపురము.
౧౦ రాజా మంత్రిప్రెగడ, రాఘవరావుగారు — లింగగిరి.
౧౧ చిక్కరాజు మట్టపల్లిరావుగారు — చెలకుర్తి.
౧౨ ముక్తిపల్లి పట్టాభిరామారావుగారు — తిరుమలగిరి.
౧౩ గూడ వెంకటరామారెడ్డి దేశముఖుగారు — ఇటికాలపల్లి.
౧౪ బాధరగుల్ సంగమేశ్వరరావు దే॥ గారు

శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి సంస్థానపు పేజంటు

౧౫ రామరాజభూషణ భాషానిలయము — పెంట్లవెల్లి.
౧౬ వలిపె వెంకటరావుగారు, వకీలు — కొల్లాపురము.
౧౭ గండికోట అనంతరామారావుగారు, జిల్లాపేష్కారు, అసఫాబాదు.
౧౮ అద్దంకి ... తిరువేంగడతాతదేశికాచార్యులయ్యవార్లంగారు, తక్కెళ్ళపాడు.
౧౯ సుంకర నరసింహముగారు, నందిగామ.
౨౦ గరికపాటి లక్ష్మీనరసింహభాస్కరశంకరశాస్త్రిగారు, అంగారుపేట.
౨౧ మియ్యాపురం రామకృష్ణారావుగారు, కొల్లాపురం.
౨౨ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.

అభినవ సరస్వతి

సంపాదకుడు - నాగరఖండ స్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు
జానపాటి పట్టాభిరామశాస్త్రి.

ఇది యొక మాసపత్రిక. ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును ప్రకటింపబడును. చందా సం॥ 1 కి రు 3-0-0

ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

1	విరూపాక్షపీఠగురుపరంపర	...	0	2	0
2	సీతాగీతులు (సుమతిశతకము, దానికి శ్లోకములు)	...	0	2	0
3	వాసంతికాపరిణయ నాటకము	...	0	4	0
4	కలికోద్ధారిణి [ప్రాచీనప్రబంధము]	...	0	4	0
5	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము		0	2	0
6	మత్స్యలనీతిశతకము	...	0	1	0
7	నరసరావుపేట శతావధానము (తిరుపతివేంకటీయము)		0	3	0
8	గుంటూరుజిల్లాతీర్పు విమర్శనము	...	0	4	0
9	సంగదోషము	...	0	3	0
10	రామాయణసారోద్ధారము	...	1	8	0
11	డిటో (తెలుగుతాత్పర్యసహితము)	...	2	8	0
12	పశ్వశబ్దవిచారము	...	0	2	0
13	పురశ్చరణము	...	0	2	0
14	విగ్రహారాధన ఖండనఖండనము	...	0	4	0
15	శంతనురాజచరిత్ర (ప్రాచీనప్రబంధము)	...	0	14	0
16	వర్ణవ్యవస్థ	...	0	4	0
17	స్వర్ణకారవ్యవహారము	...	1	8	0
18	శుద్ధాంధ్రహరిశ్చంద్ర చరిత్రము	...	0	10	0
19	మంత్రసంహిత (ఆంధ్రము)	...	2	0	0
20	భారతీయప్రబోధము (పిడుపాటి చిదంబరశాస్త్రి)		0	4	0
21	ధర్మనిర్ణయము.		0	4	0
22	అస్పృశ్యతానివారణఖండనము (మల్లాది రామకృష్ణచయనులు గారు)		0	8	0
23	భారతకథాతత్వనిర్ణయము	...	0	4	0
24	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)		1	0	0
25	డిటో నాగరఖండము (౨ సంపుటము)		1	8	0
26	డిటో నాగరఖండము (3 సంపుటము)		1	8	0
27	డిటో నాగరఖండము (౪ సంపుటము)		1	8	0

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,
గుంటూరు జిల్లా.